

సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 12-9-2025 15/-



భారతీయ విద్యా విధానం
భాషా పరిణామ చరిత్ర

# గీటురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 36 హైదరాబాద్
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 రూ.15-00
రబీఉల్ అవ్వల్ 19 1447 హిజ్రీ


**తొలిగీటు**

అబద్ధం పలకడం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మం కాదు. గంభీరంగా గానీ, పరిహాసంగా గానీ అబద్ధం చెప్పకూడదు. మీ పిల్లలకు ఏదయినా ఇస్తామని చెప్పి తరువాత ఇవ్వకపోతే అది కూడా అబద్ధమే.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**


**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


## లోపల...


| | |
|---|---|
| భూకంపం ...... | 04 |
| బీహారులో సమర శంఖం ...... | 05 |
| ఉపరాష్ట్రపతి పోరులో బీజేపీ రాజకీయ వ్యూహం ...... | 08 |
| మానవ చరిత్రలో ఘోర విషాదం గాజా ...... | 10 |
| పిల్లల పెంపకం... మాటల్లో ఒకటి, చేతల్లో మరొకటి... ...... | 12 |
| మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి) – 4 ...... | 14 |
| చరితార్థులు-2 : బేగం రెహానా అబ్బాస్ తయ్యబ్జీ ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... | 19 |
| భారతీయ విద్యా విధానం – భాషా పరిణామ చరిత్ర-1 ...... | 20 |
| క్షణం... క్షణం... మధురం ...... | 22 |
| అన్నదానం అల్లాహ్‌కు ఎంతో ఇష్టం-2 ...... | 24 |
| మీ పిల్లల ముందు ఈ మాటలు అస్సలు అనకండి ...... | 28 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| జ్ఞానం పంచేవాడు ఉపాధ్యాయుడు ...... | 34 |


### డిగ్రీ లొల్లి...



ఎందుకు చూపిస్త లేడో
మన మోడి తాత డిగ్రీ
రుజువులు జూపిస్తేనె
జనమైతరటోయి అగ్గీ!
లొల్లి జేయకండి యిక
ఏమి పట్టా గిట్ట లేదట
నిజాలు చెప్పడమంటే
తనతో అసలు కాదట!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## భూకంపం

**అఫ్ఘానిస్తాన్** భూకంపంలో మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. కూలిన భవనాలు, మృతదేహాలు, క్షతగాత్రులతో ఈ ప్రాంతం భీతావహంగా మారింది. ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారుల ప్రకారం కనీసం 800 మంది మరణించారు, 2,000 మంది గాయపడ్డారు. రాత్రివేళ అందరూ ఇండ్లలో నిద్రిస్తున్న సమయంలో భూకంపం రావడంతో కూలిన భవనాల కింద జనులు నలిగిపోయారు. ఇది మారుమూల ప్రాంతం కావడం వల్ల, భూకంపం వల్ల రహదారులపై రాళ్ళు వచ్చి పడడం వల్ల సహాయ కార్యక్రమాలు ఆలస్యమవుతున్నాయి. అలాగే మృతుల సంఖ్య కూడా ఇప్పటికీ ఖచ్చితంగా తెలియరాలేదు. ఈ ఆపద సమయంలో బాధితులను ఆదుకోడానికి ప్రపంచ దేశాలు ముందుకు రావలసిన అవసరం ఉంది.

పాకిస్తాన్ తూర్పు సరిహద్దుకు సమీపంలోని జలాలాబాద్ పట్టణం పక్కన ఉన్న పర్వత సానువుల్లో వచ్చిన భూకంపం ఇది. హిమాలయాలు, హిందూ కుష్ పర్వతాల్లో ఉన్న ప్రాంతం ఇది. యూరేషియన్, భారత టెక్టానిక్ పలకల మధ్య జరుగుతున్న ఘర్షణ వలన ఈ ప్రాంతం భూకంపాలకు తరచుగా గురవుతోంది. ఈ టెక్టానిక్ పలకల చలనం వల్లనే 2015లో నేపాల్‌లో గోర్ఖా భూకంపం, 2005లో పాకిస్తాన్‌లో కశ్మీర్ భూకంపం వంటి భయంకరమైన ప్రకంపనలు సంభవించాయి. అఫ్ఘానిస్తాన్‌లో 2023 అక్టోబరులో ఒక భూకంపం 1,500 మందికి పైగా ప్రాణాలు తీసుకుంది. అంతకుముందు సంవత్సరం మరో భూకంపం 1,000 మందికి పైగా మరణాలకు కారణమైంది. ఈ భూకంప తీవ్రత 6.0గా నమోదైంది. నిజానికి ఇది అత్యంత తీవ్రమైన భూకంపం కాదు. కాని, భూకంపం కేంద్రం కేవలం 8 కి.మీ లోతులో ఉండటం వల్ల భూమి ఉపరితలంపై బలమైన కుదుపులకు కారణమయ్యింది. తదనంతర కుదుపులు కూడా చాలా వచ్చాయి. ప్రధాన భూకంపం తరువాత 4.5 తీవ్రతతో 10 కి.మీ లోతులో, మరొకటి 5.2 తీవ్రతతో అదే లోతులో రెండు కుదుపులు నమోదయ్యాయి. కానీ కేవలం 6.0 తీవ్రత కలిగిన భూకంపం వల్ల ఇంత ప్రాణనష్టం జరగడానికి ఒక ముఖ్యమైన కారణం భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉండడం. తక్కువ లోతులో సంభవించే భూకంపాలు అత్యంత ప్రమాదకరమవుతాయి. ఉదాహరణకు, 2022 నవంబరులో ఇండోనేషియాలోని సియాంజూర్ నగరానికి సమీపంలో 5.6 తీవ్రతతో సంభవించిన భూకంపం కనీసం 268 మంది ప్రాణాలను బలిగొంది, 22,000 భవనాలు దెబ్బతిన్నాయి.

2011లో న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్‌లో వచ్చిన భూకంపం కూడా ఇలాగే తక్కువ లోతులో 6.0 తీవ్రతతో సంభవించినప్పటికీ కేవలం 185 మంది మాత్రమే మృతి చెందారు. అఫ్ఘానిస్తాన్ భూకంపంలో మరణాలతో పోలిస్తే చాలా పెద్ద తేడా కనిపిస్తుంది. నిజానికి "భూకంపం ప్రాణాలు తీయదు, భవనాలు ప్రాణాలు తీస్తాయ"ని అంటారు.

అఫ్ఘానిస్తాన్ గ్రామీణ ప్రజలు బలమైన, ఇంజనీరింగ్ ప్రమాణాలు కలిగిన భవన సామగ్రిని కొనలేరు. మట్టి, రాళ్లు ఉపయోగించి ఇళ్ళు కట్టుకుంటారు. ఇంజనీరింగ్ డిజైన్లు, భవన నిర్మాణ నియమాలు, ప్రొఫెషనల్ ప్రమాణాలు ఏమీ ఉండవు. ఈ ఇళ్ళు భూకంపం కుదుపులకు తట్టుకోలేవు. సులభంగా కూలిపోతాయి. శిథిలాల క్రింద మనుష్యులు నలిగిపోతారు.

భూకంపం వచ్చే అవకాశాలున్న ప్రాంతాల్లో భవననిర్మాణాలు, ఇండ్ల నిర్మాణాల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశాలుంటాయి. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించవలసిన అవసరం ఉంది.

కవరు కథనం

అబ్దుల్ వాహెద్




**రాహుల్ గాంధీ** బిహార్‌లో ప్రారంభించిన 16 రోజుల వోటర్ అధికార్ యాత్ర 20 జిల్లాల్లో 1,300 కి.మీ పొడవున దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దిపాంకర్ భట్టాచార్య తదితర ముఖ్య ప్రతిపక్ష నేతలు ఈ యాత్రలో పాల్గొనడంతో ప్రాముఖ్యం మరింత పెరిగింది. ఎన్నికల సంఘం అవకతవక లపై ఇదో పెద్ద పోరాటంగా రూపుదిద్దుకుంది. దీనికంతటికీ కారణం బిహారులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (Special Intensive Revision - SIR). ప్రతిపక్ష పార్టీల ఆరోపణ ప్రకారం, ఈ సవరణలో 65 లక్షలకు పైగా ఓటర్లు తొలగించ బడ్డారు. కర్ణాటకలో రాహుల్ గాంధీ పత్రికా సమావేశం తరు వాత వోట్ చోరీ నినాదం మరింత బిగ్గ రయ్యింది. ముఖ్యంగా దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలు, ముస్లింలు, అట్టడుగు వర్గాలు వంటి ప్రజలు ఓట్లు కోల్పోతున్నా రన్న అభిప్రాయం బలపడుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమకు గుర్తింపే లేకుండా పోతుందనే భయాలు ఈ వర్గాల్లో మొదలయ్యాయి. బిహారులో ఎన్నికల సంఘం ప్రారంభించిన కార్యక్రమం మామూలుగా అయితే ఓటర్ల జాబితా సవరించే కార్యక్రమం మాత్రమే. కాని ఇందులో వివిధ పత్రాలు చూపించా లని చెప్పడం, దానికి తోడు దొంగ ఓట్ల గురించి బయటపడిన వివరాలు ఇవన్నీ ఇప్పుడు చర్చల్లోకి వస్తున్నాయి. బిహార్‌లోని కుల రాజకీయ వాతావరణంలో ఈ ఆరోపణలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. ప్రతిపక్షం ఆరోపణ ప్రకారం, ఇటీవల జరిగిన ఓట్ల తొలగింపులు కుట్ర ప్రకారం జరిగాయి. వెనుక బడిన వర్గాలు, ముస్లిములు, దళితుల వంటి ఆర్‌జేడీ, వామ పక్షాలు, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేసే వర్గాల ఓట్లను తొలగిం

చడం జరిగింది.

దశాబ్దాలుగా బిహార్ రాజకీయ పార్టీలు కుల సమీకరణల ఆధారంగా నడుస్తున్నాయి. ఇప్పుడు ప్రత్యేక కుల సముదాయాలు ఓట్లు కోల్పోతాయనే అభిప్రాయం బలపడితే ఎన్డీయే కూటమికి ఎన్నికల్లో తీవ్రమైన సమస్య తప్పదు. ఇండియా కూటమి ఈ సమస్యను పూర్తిగా ఉపయోగించుకునే ప్రయత్నాల్లో ఉంది.

వోటర్ అధికార్ యాత్రలో రాహుల్ గాంధీ బీజేపీపై సూటిగా బలమైన దాడులు చేస్తున్నారు. 'వోట్ చోర్ గద్దీ ఛోడ్' అనే నినాదం బిగ్గరవుతోంది.

నిజానికి భారత్ జోడో యాత్రకు కొనసాగింపే ఈ వోటర్ అధికార్ యాత్ర అని చెప్పాలి.

ఓటర్ అధికార్ యాత్ర ప్రత్యేకత ఏమిటంటే, ఇది తక్షణ సమస్యను ముందుకు తీసుకువచ్చింది. ఓటు హక్కు కోల్పోవడం అనేది ప్రజాస్వామ్యంలో పెద్ద సమస్య. బిహారులో ఇది పేద మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద సమస్య. కుటుంబాలు తమ ఓటు హక్కు గురించి, అలాగే దానితో ముడిపడి ఉన్న సంక్షేమ హక్కుల గురించి (రేషన్ కార్డులు, భూ హక్కులు, సామాజిక భద్రతా ప్రయోజనాలు వంటివి) ఆందోళన చెందుతున్నాయి. కాంగ్రెసు పార్టీ ఇప్పుడు ప్రజల ఓట్లు దొంగిలించబడకుండా కాపాడతానంటూ ముందుకు వచ్చింది.

బిహార్‌లో చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీకి బలం లేదు. ఈ యాత్రతో రాష్ట్రంలో కాంగ్రెసు పుంజుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఆర్జేడీ, వామపక్ష పార్టీల సంఘటిత శక్తిని ఆశ్రయించి, మళ్లీ ఒక జాతీయ పార్టీగా స్థానిక సమస్యల కోసం పోరాడగల పార్టీగా కాంగ్రెస్ జనంలోకి రావడానికి ప్రయత్ని స్తోంది.

ఈ నేపథ్యంలో బీజేపీ ప్రస్తుతం ఉన్న పరిస్థితిని కూడా పరిశీ లించడం అవసరం. ఇండియా టుడే పత్రిక నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో పాల్గొన్నవారు 75 ఏళ్ల వయసు నిండిన వారు ప్రజా జీవితం నుంచి తప్పుకోవాలని అన్నారు. దాదాపు మూడు వంతులు, అంటే 73% మంది ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ సర్వేలో సి-వోటర్ జూలై 1, 2025 నుంచి ఆగస్టు 14, 2025 మధ్య అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో మొత్తం 54,788 మందిని ప్రశ్నించింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లభిస్తున్న మద్దతు తగ్గినట్లు ఈ సర్వేలో చాలా మంది అభిప్రాయాల వల్ల తెలుస్తోంది. భారత దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందనే అభిప్రాయం కూడా బలంగా వినిపించింది.

భారతీయ జనతా పార్టీ లోక్‌సభలో తక్కువ మెజారిటీ సాధించిన తర్వాత నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పరిశీలిస్తే ఆయనకు ప్రజాదరణ రేటింగ్ దాదాపు స్థిరంగానే ఉంది. కానీ 2021లో ప్రజాదరణ 70% ఉండగా, ఇప్పుడు 58%కు పడిపోయింది. 2025 ఫిబ్రవరి గణాంకాల ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రజల సంతృప్తి 10% తగ్గింది. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు సగం మంది అంటే 48% మంది భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని చెప్పారు. కేవలం 39% మంది మాత్రమే ప్రమాదంలో లేదని పేర్కొన్నారు. గత సంవత్సరం ఇదే అభిప్రాయం తెలిపినవారు 42% మాత్రమే.

దాదాపు 46% మంది బీజేపీ పాలనలో వివిధ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని భావించారు. 43% మంది ప్రతిపక్ష ప్రభుత్వాలున్న రాష్ట్రాల గవర్నర్లు రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని భావించారు. జనవరి 2021లో 55% మంది సామాజిక సామరస్యం మెరుగ్గా ఉందని నమ్మగా, ఇప్పుడు కేవలం 38% మంది మాత్రమే అలా భావిస్తున్నారు.

సామాజిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పిన వారిలో 23% మంది బీజేపీ-ఆరెస్సెస్ దీనికి కారణమని అన్నారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే ఎక్కువ.

భారతదేశంలో స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన ఎన్నికలపై విశ్వాసం ఉందని 64% మంది చెబితే, 32% మంది అంగీకరించలేదు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక పునఃసమీక్ష (SIR) సరయినదని 58% మంది భావించారు. అవినీతి విషయంలో బీజేపీ రికార్డు దెబ్బతింది, రాహుల్ గాంధీ రేటింగ్ పెరిగింది.

బీజేపీకి అవినీతిని ఎదుర్కొనే సామర్థ్యం ఉన్నదన్న అభిప్రాయం తగ్గింది. కేవలం 45% మంది మాత్రమే అవినీతి తగ్గిందని

భావించారు, 47% మంది తగ్గలేదన్నారు. కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా 66% మంది గుర్తించారు. 47% మంది కాంగ్రెస్ ప్రతిపక్ష ప్రవర్తనను ప్రశంసించారు.

రాహుల్ గాంధీకి ప్రతిపక్ష నేతగా 50% మంది మంచి రేటింగ్ ఇచ్చారు, వీరిలో 28% మంది ఆయనను అద్భుతమని అభివర్ణించారు. 63% మంది ఇండియా బ్లాక్ కొనసాగాలని భావించారు.

ఒకప్పుడు మోదీ ఆర్థిక నిర్వహణలో మన్మోహన్ సింగ్ కన్నా మెరుగనే అభిప్రాయంలో 24% ఆధిక్యం సాధించారు. కానీ తాజా సర్వేలో ఈ తేడా కేవలం 2%కి పడిపోయింది. గత సంవత్సరం మోదీ నిర్వహణ మెరుగని చెప్పిన వారు 57%, మన్మోహన్ సింగ్ నిర్వహణ మెరుగని చెప్పిన వారు 35%. ఈ సంవత్సరం మోదీ నిర్వహణ బాగుందనే వారు 45% తగ్గి పోయారు. మన్మోహన్ సింగ్ నిర్వహణ బాగుందనే వారు 43%కి పెరిగారు.

43% మంది ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు పేదలకు చేరడం లేదని, కేవలం ధనవంతులకే లబ్ధి కలుగుతోందని చెప్పారు. 56% మంది ఎన్డీఏ ఆర్థిక విధానాల వల్ల అత్యంత ధనవంతులు లబ్ధి పొందుతున్నారని నమ్ముతున్నారు. భారతదేశం నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం కేవలం ప్రతీకాత్మకమని, వాస్తవ లాభం తక్కువేనని 50% మంది భావించారు. చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లకు సరైన మద్దతు ఇవ్వలేదని 46% మంది భావించారు. 72% మంది నిరుద్యోగాన్ని అత్యంత పెద్ద సమస్యగా పేర్కొన్నారు. ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన విజయంగా అయోధ్య రామ మందిరం నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్‌ను గుర్తించారు. 61% ఖర్చులు పెరిగాయని చెప్పారు.

ఇది సర్వేలో కనిపిస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో బిహారులో వోటరు అధికార్ యాత్ర ప్రకంపనాలు సృష్టిస్తోంది. ప్రస్తుతం బిజేపీ బలహీనపడుతోందన్నది స్పష్టంగా తెలుస్తున్న విషయం. బిహార్ ఎన్నికల్లో బిజేపీకి ఇది పెద్ద సవాలు. ఎన్డీఏ ప్రభుత్వ పెద్ద వైఫల్యం నిరుద్యోగమే అని 2025 సర్వే తేల్చింది. ప్రజల్లో ఓటు హక్కు కోల్పోయే భయం ఇప్పుడు చర్చనీయాంశంగా ఇండియా కూటమి మార్చినప్పటికీ, దాన్ని ఓట్లుగా మార్చడం అంత తేలిక కాదు. ఇండియా కూటమి పార్టీల సామర్థ్యం, బూత్ స్థాయి ఉనికి, పోరాట పటిమ, వనరుల నిర్వహణపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. విస్తారమైన వనరులు, కేడర్ బలం ఉన్న బిజేపీని ఇండియా కూటమి ఎంతవరకు నిలువరిస్తుందో వేచి చూడాలి.

✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- ☛ సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ☛ ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ☛ ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ☛ ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

# ఉప రాష్ట్రపతి పోరులో బీజేపీ రాజకీయ వ్యూహం




యం.డి. ఉస్మాన్‌ఖాన్

**భారత రాజకీయాల్లో** ఉపరాష్ట్రపతి ఎన్నిక సాధారణంగా పెద్దగా ఆసక్తి రేకెత్తించని అంశంగా భావించబడుతుంటుంది. కారణం, ఈ పదవి ప్రధానంగా రాజ్యసభకు అధ్యక్షత వహించడం వరకే అన్న ఊహ. కానీ వాస్తవానికి, ప్రతి ఉపరాష్ట్రపతి ఎన్నిక వెనుక విస్తృతమైన రాజకీయ వ్యూహం, దీర్ఘకాలిక లెక్కలు దాగి ఉంటాయి. ఈసారి కూడా అదే దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

బీజేపీ ఈ ఎన్నికను కేవలం ఒక పదవిని భర్తీ చేయడంగా కాకుండా, భారతదేశ రాజకీయ పటాన్ని పునర్వ్యవస్థీకరించే ఒక పావుగా చూస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓబీసీ వర్గాల మద్దతును స్థిరంగా సొంతం చేసుకోవడం- ఇవి రెండు ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటివరకు బీజేపీకి పెద్ద విజయాలు ఇవ్వలేదు. తెలంగాణ తప్ప తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ ... ఇవన్నీ బీజేపీకి చేదు అనుభవాల వేదికలే. కర్ణాటకలో ఒక దశలో బలాన్ని ప్రదర్శించినా మళ్లీ ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. అలాంటి పరిస్థితిలో, ఉపరాష్ట్రపతి స్థానం కోసం దక్షిణాది నుంచి ఒక నాయకుడిని ఎంపిక చేయడం ద్వారా బీజేపీ స్పష్టమైన సంకేతం పంపుతోంది: 'మేము దక్షిణాదిని విస్మరించలేదు, ఇక్కడి ప్రజల మనసునూ గెలుచుకుంటాం' అనేది ఆ సంకేతం.

ఇక రెండవ అంశం, ఓబీసీ రాజకీయాలు. దేశ రాజకీయాల్లో ఓబీసీ వర్గాల ప్రాధాన్యం నిరంతరం పెరుగుతోంది. ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ సమీకరణ బీజేపీకి గణనీయ లాభం చేకూర్చింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని దక్షిణాదికి విస్తరించాలనే సంకల్పం స్పష్టంగా కనిపిస్తోంది. ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వం ద్వారా బీజేపీ మరోసారి, 'మేము కేవలం హిందుత్వ పార్టీ మాత్రమే కాదు, సామాజిక న్యాయం కోసం పోరాడే పార్టీ కూడా' అనే సంకేతాన్ని ఇవ్వాలని చూస్తోంది. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న బిజెపి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సి.పి రాధాకృష్ణన్ గతంలో ఆరెస్సెస్‌లో ప్రధాన భూమిక నిర్వహించిన వ్యక్తుల్లో ఒకరు.

ఇదే సమయంలో, ఇండియా కూటమి తన ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేసింది. ఈ ఎంపిక కేవలం రాజకీయ నిర్ణయం కాదు, భారత ప్రజాస్వామ్యానికి పారదర్శకమైన పటిష్ట సందేశం. రాజ్యాంగంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఉన్న అంకితభావం, న్యాయవ్యవస్థ స్వతంత్రత పట్ల ఆయన నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలపై ఆయన నిలకడ- ఇవన్నీ కలిసి ఆయనను నీతిమంత మైన, గౌరవనీయమైన అభ్యర్థిగా నిలబెడతాయి. బీజేపీ లెక్కలు

ప్రాంతీయ సమీకరణాలు, వర్ణ, వర్గ ప్రయోజనాలపై దృష్టి పెట్టితే, ఇండియా కూటమి రాజ్యాంగ స్వతంత్రత, న్యాయవ్యవస్థ గౌరవం అనే అంశాలను ముందుకు తెస్తూ పోటీని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే సత్సంకల్పంతో ముందుకెళ్తోంది.

అయితే అసలు కిటుకు ఇక్కడే ఉంది. బీజేపీ వేసిన ఈ రాజకీయ ఎత్తుగడ భారతదేశ భవిష్యత్తుకు ఇస్తున్న సంకేతం ఏమిటి? ఒకవైపు ప్రాంతీయత, వర్గీయతను చాకచక్యంగా ఉపయోగించు కుంటూ బీజేపీ తన పట్టును విస్తరించుకుంటోంది. మరోవైపు, ఈ క్రమంలో భారత విభిన్నత, సమానత్వం, సమగ్రత అనే విలువలు బలహీనమవుతున్నాయనే ఆందోళన పెరుగుతోంది.

ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీజేపీ ఒక మాస్టర్‌స్ట్రోక్ ఆడుతున్నట్టే ఉంది. ఒకవైపు దక్షిణాది భావజాలానికి అనుగుణమైన రూపంతో ముందుకు వస్తూ, మరోవైపు జాతీయ స్థాయిలో ఓబీసీ సమీకరణా లను తన వశం చేసుకుంటోంది. ఇలా చేస్తూ పార్టీ దేశమంతటా ఒకే విధమైన ఆధిపత్య క్రమాన్ని నెలకొల్పాలనే ప్రయత్నంలో ఉందని చెప్పాలి.

ఈ ప్రయోగం విజయవంతమైతే, భారతదేశం ఫాసిజం, మనువాదం దిశగా సాగిపోయే ప్రమాదం ఉంది. విభిన్నత, ప్రజాస్వామ్యం, సమానత్వం బలహీనమై, ఒకే వర్గం ఆధిపత్యం పెరిగే అవకాశం ఉంటుంది. ఇది కేవలం ఒక ఎన్నిక కాదు, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు దిశను నిర్ణయించే రాజకీయ మలుపు.

అందుకే ఉపరాష్ట్రపతి ఎన్నికను చిన్న విషయంగా చూడకూడదు. ఇది బీజేపీకి వ్యూహాత్మక విజయం సాధించాలనే పరీక్ష, దేశానికి మాత్రం ఒక పెద్ద హెచ్చరిక.

## దక్షిణాదిలో బీజేపీ సంక్లిష్టతలు

దక్షిణాది రాష్ట్రాలు ఎప్పటి నుంచో తమ ప్రత్యేక సాంస్కృతిక, భాషా, రాజకీయ ఐడెంటిటీని కాపాడుకుంటూ వచ్చాయి. ఈ ప్రాంతంలో బీజేపీకి ఎదురవుతున్న ప్రధాన సమస్య ఏమిటంటే, ఇక్కడి ఓటర్లను ఆకర్షించడానికి కేవలం 'హిందూ భావజాలం' సరిపోవడం లేదు. తమిళనాడులో ద్రవిడ రాజకీయాలు, కేరళలో లెఫ్ట్ వాదాలు, తెలంగాణ, ఆంధ్రాలలో ప్రాంతీయ పార్టీలు బల మైన పట్టు కలిగి ఉన్నాయి. ఇక్కడ బీజేపీ తన వేర్లు నాటడం సహజంగానే కష్టం.

అందుకే బీజేపీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని ఒక వ్యూహాత్మక వేదికగా ఉపయోగించుకోవాలని చూస్తోంది. 'మాది ఉత్తరాది పార్టీ మాత్రమే కాదు, దక్షిణాది గౌరవాన్ని కూడా గుర్తించే పార్టీ' అన్న సందేశాన్ని ఇవ్వాలనే ప్రయత్నం ఇది.

## ఓబీసీ రాజకీయాల విస్తరణ

భారత రాజకీయాలలో ఓబీసీ వర్గాలు ఒక పెద్ద 'నిశ్శబ్ద శక్తి'. గత రెండు దశాబ్దాల్లో వీరి ప్రాధాన్యం అమితంగా పెరిగింది. బీజేపీ ఈ వర్గాన్ని తనవైపు తిప్పుకోవడంలో చాలావరకు విజయ వంతమైంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఓబీసీ గుర్తింపును రాజకీయంగా మార్చడం బీజేపీ విజయానికి కీలక కారణమైంది. ఇప్పుడు అదే వ్యూహాన్ని దక్షిణాదిలో కూడా అమలు చేయాలని పార్టీ చూస్తోంది. ఉపరాష్ట్రపతి స్థానం ఒక సాధనం మాత్రమే, కానీ దాని ద్వారా ఓబీసీ వర్గాల్లో తన ప్రాధాన్య సంకేతాన్ని గట్టిగా చూపించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

ఈ వ్యూహాలు ఒకవైపు రాజకీయ చతురతగా కనిపించినా, మరోవైపు దేశ భవిష్యత్తుపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఎందుకంటే,

- ◆ ప్రతి ప్రాంతాన్ని మత వర్గీయ సమీకరణల దృష్టితో మాత్రమే చూడడం..
- ◆ ప్రజాస్వామ్య విలువల కంటే రాజకీయ లెక్కలు ప్రధానమవడం..
- ◆ ఒకే పార్టీ ఆధిపత్యం కోసం సామాజిక విభజనను వినియోగించడం..

ఇవన్నీ భారత ప్రజాస్వామ్య ప్రాణాధార సూత్రాలను బలహీన పరచే సంకేతాలు.

ఉపరాష్ట్రపతి ఎన్నిక సాధారణ సంఘటనలా కనిపించవచ్చు, కానీ దాని వెనక దాగి ఉన్న రాజకీయ పథకాలు చాలా బలమైనవి. బీజేపీ దక్షిణాదిలో బలపడాలని, ఓబీసీ వర్గాలను గట్టిగా తనవైపు తిప్పుకోవాలని కాంక్షిస్తోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, అది భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

కాబట్టి ఈ పోటీ కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య కాదు, రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతోంది. ఒకవైపు బీజేపీ ప్రాంతీయ, వర్గీయ రాజకీయ చతురత, మరోవైపు ఇండియా కూటమి ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలపై అంకితభావం. అందుకే ఇది దేశ రాజకీయ దిశను నిర్ణయించే కీలక మలుపు అనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.




**గాజా**లో పరిస్థితి ఇప్పుడు ఒక సాధారణ యుద్ధ విపత్తులా లేదు, మానవ చరిత్రలోనే ఒక అతి భయానక దుస్థితిగా మారిపోయింది. ప్రతి రోజు అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఆకలి, దాహం, మరణాల దృశ్యాలు మనసును కలచి వేస్తున్నాయి. పాశ్చాత్య పత్రికలు కూడా గాజా వాస్తవాలను బహిర్గతం చేస్తూ ప్రపంచ మనసాక్షిని కదిలించే వివరాలను అందిస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీ (UNRWA) అధిపతి ఫిలిప్ లజారినీ ఒకచోట ఇలా వేదనతో చెప్పారు:

'మా సిబ్బందే ఆకలితో కుప్పకూలిపోతున్నారు. ప్రాణాలను కాపాడేందుకు తపనపడుతున్న వారికే తిండి లేకపోతే, గాజాలోని మొత్తం మానవ సహాయక వ్యవస్థ కూలిపోకుండా ఎలా నిలబడ గలదు?'

ఒక సహచరుడు కన్నీటి గళంతో చెప్పాడు:

'గాజా ప్రజలు బ్రతికీ లేరు, మరణించనూ లేదు, వారు నడిచే జీవచ్ఛవాలుగా మిగిలారు.'

జోర్డాన్, ఈజిప్ట్‌లలో ఔషధ, ఆహార సామగ్రితో నిండిన ఆరు వేల సహాయక ట్రక్కులు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇస్రాయీల్ అనుమతించకపోవడంతో అవి గాజా సరిహద్దును దాటలేకపోతున్నాయి. ఫలితంగా ప్రజలు ఆకలితో కుప్పకూలి ప్రాణాలు వదులుతున్నారు. రక్షణ సిబ్బంది తీసిన చిత్రాలలో కేవలం ఎముకలకు అంటుకున్న చర్మం మాత్రమే మిగిలిన శరీరాలు ఎముకల గూళ్ళుగా కనిపిస్తున్నాయి.

## అంతర్జాతీయ ప్రతిస్పందన

ఆకలితో మరణిస్తున్న పాలస్తీనీయుల దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. జూలై 23న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ ఫలస్తీనాను అధికారిక దేశంగా గుర్తిస్తామని ప్రకటించారు. దీనిపై ఇస్రాయీల్ ప్రధాని నేతన్యాహు మాక్రాన్ పై మండిపడుతూ.., 'ఇది ఉగ్రవాదానికి ఊతమివ్వడమే' అన్నాడు.

అదే సమయంలో బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ ఇలా అన్నారు:

'గాజాలో ఆకలి బాధల గాథలు వర్ణించనలవి కానివి. పరిస్థితి చాలాకాలంగా అత్యంత విషమంగా ఉంది, కానీ ఇప్పుడు అది మహా భయంకరమైన మలుపు తిరిగింది. మనం ఇప్పుడు ఒక కనీవినీ ఎరుగని మానవ విపత్తును ప్రత్యక్షంగా చూస్తున్నాం.'

## పోషకాహార లోపం - మరణమార్గం

లండన్ గార్డియన్ (జూలై 25) నివేదిక ప్రకారం: గాజా నగరంలోని

ఒక వైద్య కేంద్రంలో ఐదేళ్ల లోపు పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం కేవలం రెండు వారాల్లో మూడింతలు పెరిగింది.

### మానవతా సంస్థల హెచ్చరిక

'గాజా ఒక విస్తృతమైన కరువు కోరల్లోకి నెట్టబడుతోంది. ప్రతిరోజూ ప్రజలు ఆకలితో అల్లాడి చనిపోతున్నారు. కానీ ఇస్రాయీల్ మాత్రం కేవలం చిన్న చిన్న సహాయానికి మాత్రమే అనుమతి స్తోంది.'

మే నెల నుండి ఇప్పటివరకు గాజాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న రోగుల సంఖ్య నాలుగింతలు పెరిగింది. ఇది పూర్తిగా ఇస్రాయీల్ విధించిన 'ఆకలిని ఒక ఆయుధంగా మార్చిన అమానవీయ విధాన' ఫలితం.

### ప్రపంచ ఆహార కార్యక్రమం (WFP) గణాంకాలు

ప్రతి ముగ్గురిలో ఒకరు అనేక రోజులుగా తినడానికి ఏమీలేక ఆకలి కడుపులతో మగ్గిపోతున్నారు. వారికి తినడానికి ఏమీ దొరకడం లేదు.

90 వేలమంది మహిళలు, పిల్లలు అత్యవసర వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

### వైద్యుల ఆవేదన

గాజాకు చెందిన స్త్రీరోగ నిపుణుడు డాక్టర్ నాజీ అల్ కురాష్ట్రీ కన్నీటి పర్యంతమవుతూ ఇలా చెబుతున్నారు:

'నా పూర్తి వైద్య వృత్తిలో ఇంత భయంకర దృశ్యాలు ఎప్పుడూ చూడలేదు. తినడానికి కనీసం తిండి లేక గర్భిణీ మహిళల్లో గర్భస్రావాల సంఖ్య పెరిగింది. పుట్టే పిల్లలు తక్కువ బరువుతో, వికలాంగులుగా పుడుతున్నారు. గర్భిణీలకు, రోగులకు, చివరికి పసికందులకు కూడా గడువు తీరిన (ఎక్స్పయిరీ అయిన) మందులు ఇవ్వాల్సి వస్తోంది, ఇతర వైద్యులు వాడి పడేసిన గ్లౌజులు మళ్లీ వాడాల్సిన పరిస్థితి. ఇది ఒక వైద్యుడికి అత్యంత అవమానకరమైన, బాధాకరమైన అనుభవం.'

### ప్రపంచ నాయకుల పిలుపు

ఇస్రాయీల్ ఆంక్షలతో సహాయక కేంద్రాలు మూతబడగా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నాయకులు సంయుక్త ప్రకటనలో: 'గాజాలో మానవ విధ్వంసం వెంటనే ఆగాలని, ఇస్రాయీల్ సహాయక ఆంక్షలను ఎత్తివేయాలని' పిలుపునిచ్చారు.

అయితే జూలై 25 న ఇస్రాయీల్ సైన్యం జోర్డాన్, యూఏఈ నుంచి విమానాల ద్వారా సహాయం అనుమతించామని తెలిపింది. కానీ విమానాల ద్వారా వచ్చే సరుకులు చాలా చాలా తక్కువ. దీనిని హమాస్ 'రాజకీయ నాటకం'గా అభివర్ణిస్తూ ఖండించింది. హమాస్ మీడియా అధికారి ఇస్మాయీల్ అల్ థవాబితా మాట్లాడుతూ:

'గాజాకు గగన సహాయం ఏమాత్రం సరిపోదు, ఓపెన్ భూమార్గం కావాలి. ప్రతిరోజూ సహాయక ట్రక్కులు రాకపోతే మిగిలిన ప్రజల ప్రాణాలు రక్షించడమూ కష్టమే' అని ఆవేదనగా తెలిపారు.

మరో అమానుషమైన దుశ్చర్య ఏమిటంటే, ఆహార పదార్థాల కోసం క్యూలో నిలబడి ఉన్నవారిలో వెయ్యి మందికి పైగా ప్రజలను ఇస్రాయీల్ దళాలు అతి కిరాతకంగా కాల్చి చంపేశాయి.

ఈ అమానవీయ దుస్థితిపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ:,

'గాజాలో ఆకలితో అలమటిస్తూ, కనీస అవసరాలకోసం సతమతమవుతున్న ప్రజలపై ప్రపంచం ఏమాత్రం కనికరం చూపుతున్నట్లు లేదు. నిశ్శబ్దంగా తమాషా చూస్తోంది. ఇది కేవలం మానవ విపత్తు మాత్రమే కాదు, ఆధునిక కాలంలో ఒక భయానక నైతిక సంక్షోభం. ప్రపంచ మనసాక్షిని ఇది కదిలిస్తోంది. కానీ దురదృష్టవశాత్తూ, పెద్ద దేశాలు ఏ ఒక్కటీ అడుగు ముందుకు వేయడం లేదు.'

గాజాలో రక్తం, ఆకలి, కన్నీటి వాన కురుస్తున్నా ప్రపంచం ఇంకా నిశ్శబ్దంగానే ఉంది. ఇది కేవలం ఒక మానవ విపత్తు మాత్రమే కాదు, మన సమకాలీన నాగరికతకు అతిపెద్ద నైతిక పరీక్ష. గాజా పిల్లల ఏడుపు వినిపించకపోతే మనస్సాక్షి మూగబోయినట్టే. చరిత్రలో ఒక రోజు ఈ మౌనం మానవత్వానికి కళంకంగా నమోదు అవుతుంది. కనీసం ఇప్పటికైనా ప్రపంచం నిద్రలేచి, గాజా కోసం గట్టిగా నిలబడాలి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



- అర్షియా

# పిల్లల పెంపకం... మాటల్లో ఒకటి, చేతల్లో మరొకటి ఉండకూడదు!

**“విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబసభ్యులనూ మానవులు, రాళ్లు ఇంధనం కాబోయే అగ్నినుండి కాపాడుకోండి.”**

**(దివ్య ఖుర్‌ఆన్ 66: 6)**

ఇస్లాం కేవలం వ్యక్తిగత ఆరాధనలు లేదా కొన్ని ప్రత్యేక ఆదేశాల సమాహారం మాత్రమే కాదు, అది ఒక సంపూర్ణ జీవన విధానం. ఇది మానవ జీవితంలోని ప్రతి దశలోనూ, ప్రతి సందర్భంలోనూ మార్గదర్శనం చేస్తుంది. ఈ విధానంలో కుటుంబం, ముఖ్యంగా తల్లిదండ్రుల బాధ్యతలు చాలా ముఖ్యమైనవిగా, పవిత్రమైనవిగా పరిగణించబడతాయి. ఎందుకంటే, భావితరాల ఆలోచనా విధానానికి, నైతికతకు తల్లిదండ్రుల పెంపకంలోనే పునాది పడుతుంది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: “మీలో ప్రతి ఒక్కరూ కాపలాదారుడే, ప్రతి ఒక్కరినీ వారి సంరక్షణలో ఉన్న వారిని గురించి ప్రశ్నించడం జరుగుతుంది.” (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం).

ఇస్లామిక్ బోధనల ప్రకారం తల్లిదండ్రుల పాత్ర, బాధ్యత కేవలం పిల్లలకు జన్మనివ్వడం, వారి అవసరాలను తీర్చడం మాత్రమే కాదు. వారు తమ పిల్లల వ్యక్తిత్వం, విశ్వాసం, స్వభావం, ఆలోచనలకు పునాది వేసే ఆధ్యాత్మిక విశ్వాసాలు కూడా నూరిపోయాలి. ఈ పునాదిలో నిజాయితీ, దైవభీతి, ప్రవక్త సున్నత్, ధార్మిక అవగాహన లేకపోతే, పిల్లల వ్యక్తిత్వం బలహీనంగా మారిపోతుంది. దురదృష్టవశాత్తు, ప్రస్తుత కాలంలో ఒక ఆలోచనా వైఫల్యం ఇస్లామిక్ కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. మాటల్లో మతపరమైన విషయాలు మాట్లాడేవారు, చేతల్లో మాత్రం పాశ్చాత్య సంస్కృతిలో మునిగిపోతున్నారు. ఇలాంటి వారే ఈ రోజుల్లో పిల్లల పెంపకం, కుటుంబ వ్యవస్థపై మార్గదర్శనం చేసేవారుగా తయారయ్యారు. వీరి జీవితం, పిల్లలు, అభిరుచులు, కార్యక్రమాలు, వినోదాల విధానం అన్నీ ధార్మిక సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉంటాయి. అయినప్పటికీ, వీరు సమాజాన్ని సంస్కరించాలని జెండాలు పట్టుకొని నిలబడతారు. ఈ వ్యాసం ఈ విషాద పరిస్థితి గురించే చర్చిస్తుంది.

ఇది నేటి కాలంలో ఒక బాధాకరమైన వాస్తవం. తల్లిదండ్రుల పెంపకం, పిల్లల పోషణ, ఇస్లామిక్ విలువలను గురించి సున్నితమైన, ముఖ్యమైన ఉపన్యాసాలు ఇచ్చేవారు, వ్యాసాలు రాసేవారు, లేదా పుస్తకాలు రచించేవారు చాలా తరచుగా తమ నిజ జీవితంలో ఇస్లామిక్ బోధనలకు పూర్తిగా విరుద్ధమైన వైఖరులను కలిగి ఉంటారు. ఎవరి ఇళ్లలో సంగీత వాయిద్యాలు మోగుతున్నాయో, ఎవరి సంతోష వేడుకలు పాటలు, నృత్యాలతో కూడి ఉంటున్నాయో, ఎవరి సభల్లో ఖురాన్, హదీసులకు బదులుగా

సినిమా సంభాషణలు, పాటలు వినిపిస్తున్నాయో వారే ఈ కాలపు "సంస్కర్తలు", "మార్గదర్శకులు"గా ఉద్భవిస్తున్నారు. వారి సోషల్ మీడియా పేజీలలో కుటుంబంతో కలిసి సినిమా థియేటర్లలో తీసుకున్న ఫోటోలు, వీడియోలను కేవలం ప్రదర్శన కోసం మాత్రమే కాదు, వాటిని వారు గర్వించదగిన జీవిత వైభవంగా భావిస్తున్నారు.

ఈ వర్గం వారి జీవితాల్లో ఇస్లామిక్ జీవన సిద్ధాంతం పునాదులు వణికిపోతున్నాయి. వారి ఆలోచనలు పాశ్చాత్య సంస్కృతితో రూపుదిద్దు కున్నాయి. వారి మాటల్లో ఇస్లామిక్ భావం ఉన్నప్పటికీ, చేతల్లో పాశ్చాత్య ప్రభావం ఎక్కువగా ఉంటున్నది. వారి పిల్లలు సంగీత వాయిద్యాలు వాయించి ప్రశంసలు పొందినప్పుడు, వారు దానిని "ప్రతిభ", "సృజనాత్మకత" అని పిలిచి ప్రపంచానికి చూపిస్తారు. అదే వారి పెంపకంలో ముఖ్యమైన అంశంగా భావిస్తారు.

ఉపదేశకుడికే విలువలు లేనప్పుడు, నైతిక విలువలు బోధించే గురువు జీవితమే పరస్పర విరుద్ధంగా ఉన్నప్పుడు, సంస్కరణ అనేది కేవలం మాటలకే పరిమితమైనప్పుడు, ఇలాంటి వ్యక్తులు కొత్త తరంలో ఇస్లామిక్ విలువలను నిజంగా నాటగలరా? తన ఆలోచనల్లో స్పష్టమైన విధానం లేని వ్యక్తి ఇతరులకు నియమాలను బోధించడం సాధ్యమేనా? తమ జీవితంలో సినిమా, సంగీతం, ఫ్యాషన్, అశ్లీలత, సోషల్ మీడియా ప్రదర్శన ఎక్కువ ఉన్నవారు భవిష్యత్తు తరాలను ఇస్లాం నిజమైన మార్గంలో నడిపించగలరా?

ఇస్లాం కేవలం కొన్ని బయటి చిహ్నాల పేరు కాదు, అది ఒక సంపూర్ణ జీవన విధానం. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకానికి సంబంధించి తల్లిదండ్రుల బాధ్యత కేవలం వారి పోషణకు మాత్రమే పరిమితం కాదు. పిల్లల ఆధ్యాత్మిక శుద్ధీకరణ, ఆలోచనా శిక్షణ, నైతిక ప్రక్షాళన కూడా తల్లిదండ్రుల బాధ్యతలో అంతర్భాగం. తమ హృదయంలో విశ్వాసం, చేతల్లో దైవభీతి, జీవితంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌ను పాటించే స్ఫూర్తి ఉన్న తల్లిదండ్రులకే తమ పిల్లల పట్ల తమ బాధ్యతను సమర్థంగా నిర్వహించడం సాధ్యమవు తుంది. సమతుల్య ఇస్లామిక్ జీవన విధానానికి ఒక సానుకూల ఉదాహరణ: ఒక బాధ్యత గల తండ్రి తన పిల్లలతో కలిసి ప్రవక్త జీవిత గాథలు వింటాడు. పిల్లల్ని మసీదుకు తీసుకెళతాడు. పిల్లల ప్రశ్నలకు ప్రేమతో సమాధానం ఇస్తాడు. పిల్లలకు అందించే వినోదం ఇస్లామిక్ పరిధిలో ఉండేలా చూస్తాడు. ఇలాంటి పెంపకంలో పెరిగిన పిల్లలు ధార్మిక, ప్రాపంచిక విద్యలో సమతుల్యంగా ముందుకు వెళ్తారు. అలాంటి తల్లిదండ్రుల జీవితం ఆదర్శంగా నిలుస్తుంది.

కాబట్టి, ఈ కాలంలో సమాజాన్ని సంస్కరించడానికి పూనుకునే వారు ముందుగా తమను తాము సంస్కరించుకోవడం అవసరం. వారి జీవితం, వారి ఇల్లు, వారి వినోదం, వారి ఆలోచనలన్నీ ధర్మం పరిధిలోకి రావాలి. అప్పుడే వారి మాటల్లో ప్రభావం ఉండి. వారి ప్రచారం నవ తరాల హృదయాలను చేరుతుంది. లేకపోతే, ఈ 'అర్ధ-విద్యావంతులైన సంస్కర్తలు' తమ విరుద్ధమైన జీవితాలతో సమాజాన్ని తప్పుదోవ పట్టించడమే కాకుండా, ఇస్లాం పేరుతో ఒక భ్రమను మిగిల్చిపోతారు. ఇది భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుంది. ముస్లిం సమాజం బయటి మతాచారాల పట్ల ఆకర్షణకు గురై, అంతర్గత సంస్కరణను విస్మరించినప్పుడు, నిజమైన ఇస్లాం ధర్మ భావజాల ప్రచారం నిష్ప్రయోజనంగా మిగిలిపోతుంది.

ఇస్లామిక్ సమాజపు పునాది నిష్కపటమైన సంకల్పం, చేతల శుద్ధీకరణ, ప్రవక్త సున్నత్‌ను అనుసరించడంపై ఆధారపడి ఉంటుంది. ఈ పునాదిని బలహీనపరిస్తే మతపరమైన ఉపన్యాసాలు, పుస్తకాలు, వర్క్‌షాప్‌లు కేవలం కంటికి ఆకర్షణగా మిగిలిపోతాయి. ఉపదేశకుడు నిజాయితీపరుడిగా, చేతల్లో దైవభీతితో, ఆలోచనల్లో స్పష్టంగా లేనంతవరకు పిల్లల నిజమైన పెంపకం సాధ్యం కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మత ప్రచారంతో సంబంధం ఉన్నవారు ముందుగా తమ అంతరాత్మను సంస్కరించుకోవడమే నేడు ముఖ్యమైన అవసరం. మన జీవితాన్ని అల్లాహ్, ఆయన ప్రవక్త ఆదేశాల ప్రకారం మలచు కోవాలి. పిల్లలకు కేవలం ధార్మికపరమైన పదాలను నేర్పిస్తే సరిపోదని, వారు మన జీవన విధానాన్ని చూసి నేర్చుకుంటారని మనం అర్థం చేసుకోవాలి. మన ఇళ్లలో సున్నత్ సువాసన లేకపోతే, మనం పిల్లలకు హలాల్ (ధర్మ సమ్మతం), హరామ్ (నిషిద్ధం) గురించి అవగాహన కల్పించలేకపోతే, మన మనసులు పాశ్చాత్య ఆలోచనలకు బానిసలుగా ఉండిపోతే, మనం ఒక కొత్త తరాన్ని మాత్రమే కాదు, మొత్తం సమాజం భవిష్యత్తును నాశనం చేస్తున్నామని గుర్తుంచుకోవాలి.

సయ్యద్ కుతుబ్ షహీద్ ఇలా అన్నారు: "మనం పాశ్చాత్య దేశాల నుండి ప్రభావితమై వారి జీవన విధానాన్ని అనుసరిస్తే, మన ఆధ్యాత్మిక గుర్తింపును కోల్పోతాము." ఇమామ్ హసన్ అల్-బన్నా ఇలా అన్నారు: "మన యువకుల చేతిలో ఖురాన్‌కు బదులుగా ఫ్యాషన్ మ్యాగజైన్‌లు ఉంటే, మనం సమాజానికి మార్గదర్శనం చేయలేము."

అల్లాహ్ ఖురాన్‌లో పదే పదే దైవభీతి, నిజాయితీ, నిష్కపటత్వం, పిల్లల పెంపకం ప్రాముఖ్యత గురించి మనకు ఉపదేశించాడు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తీర్పు రోజున తల్లిదండ్రులను వారి "పెంపకం" గురించి ప్రశ్నిస్తాడని హెచ్చరించారు. ఈ ప్రశ్నకు మనం సిద్ధంగా ఉన్నామా? కాబట్టి మనల్ని మనం ఆలోచనా త్మకంగా, ఆధ్యాత్మికంగా సమర్థులుగా మలచుకోవాలి. తద్వారా నవ తరానికి స్వచ్ఛమైన, సిద్ధాంతబద్ధమైన మంచి ఇస్లామిక్ వాతావరణాన్ని అందించగలం. మనం మాటలకు, చేతలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని వదిలి, స్వచ్ఛమైన పిల్లల పెంపకం వైపు మన ప్రయాణాన్ని ప్రారంభించాలి. ❖





# తల్లిని ఒప్పించిన తనయుడు

ఎస్.ఎమ్. మలిక్

# మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి)

## 4. పరిపాలనా బాధ్యత

మదాయన్ విజయం తరువాత ఖలీఫా ఉమర్(ర) మహనీయ సఅద్(ర)కు లేఖ వ్రాశారు, "ఇకపై మీరు స్వయంగా యుద్ధ రంగానికి వెళ్ళనవసరం లేదు, ఇతర దళాధిపతుల్ని పంపవచ్చు" అని. మహనీయ ఉమర్(ర), మహనీయ సఅద్ జయించిన ఈరాన్ రాష్ట్రాలన్నింటికీ ఆయన్నే రక్షణ మంత్రిగా నియమించారు. ఇంకా సైనిక చర్యల్లో నిపుణులయిన వారి సహాయం తీసుకునే ఆదేశం కూడా ఇచ్చారు.

### పరిపాలనా నిర్వహణ, సుస్థిరత

అధీనమయిన దేశాల సుస్థిరతకు, సక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేయడం మహనీయ సఅద్(ర) బాధ్యతే. ఆ పని అధీన పరచుకోవడం కన్నా చాలా ముఖ్యమయినది. అంతే కాకుండా ధర్మ సందేశం ప్రజలకు అందజేయడం, ఇస్లామ్ స్వీకరించిన నవ ముస్లిముల ఆలోచనాత్మక, ఆచరణాత్మక సుశిక్షణ, నమాజ్ వ్యవస్థ స్థాపన, ఈ బాధ్యత ముస్లిము లందరి పైన నెలకొల్పడం తదితర బాధ్యతలన్నీ మహనీయ సఅద్(ర) నిర్వహించవలసి ఉంటుంది. ఆయనకు ఖిలాఫత్ కేంద్రం నుంచి అందిన ఫర్మానాలో నమాజ్ సమయాల వివరణ, దానిపై సామూహిక ఆచరణకు ఆదేశముంది.

### దీని తాలూకు ఆదేశం ఈ పదాలతో మొదలయింది

నా(ఖలీఫా) దృష్టిలో మీరు నిర్వహించవలసిన అతి ముఖ్య మయిన బాధ్యత నమాజ్ వ్యవస్థ సంస్థాపనం, ఎందుకంటే ఏ వ్యక్తి నమాజ్‌ని రక్షిస్తాడో అతను ధర్మాన్ని రక్షిస్తాడు. మరెవ రయితే నమాజ్ పట్ల అశ్రద్ధ చేస్తాడో అతను (అంత వరకే కాక) ఇతర విషయాలను సయితం వదలి వేస్తాడు.

మహనీయ సఅద్(ర) ఈ ఫర్మానాను ఎంతో పకడ్బందీగా అమలు పరిచారు. ఆయన అధికారికంగా ఓ ప్రకటన చేయిం చారు. దాని ప్రకారం ఎవరయితే నమాజ్‌ని దాని సకల

ఆవశ్యకతలతో, దాని సకల స్వల్పమయిన అంశాలతో సహా పాటించరో వారు ముస్లిమ్ సముదాయ వ్యక్తిగా పరిగణించ బడరు, ఇంకా వారు దైవ దాస్యానికి, దైవ విధేయతకు సిద్ధంగా లేరని అనుకోవలసి వస్తుంది. ఈ ప్రకటన ఆయన కల్పన కాదు. ఎందుకంటే ధార్మిక విషయాల్లో ఎవ్వరికీ తన ఇష్టం వచ్చినట్లు ఆదేశాలు జారీ చేసే అధికారం లేదు. ఆయన చేసిన ఈ ప్రకటన, జన సామాన్యానికి ఇచ్చిన ఈ నోటీసు, దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనానికి అద్దం పడుతోంది:

> **జనులు దైవ తిరస్కారం, బహుదైవారాధన నుంచి విముఖు లయి నమాజ్‌ని దాని ఆవశ్యకతలతో సహా పాటిస్తే ఇంకా జకాత్ చెల్లిస్తే ఇక వారు మీ ధార్మిక సోదరులే.**
>
> ***(అత్ తౌబా 9 :11)***

## మస్జిద్ ల నిర్మాణం

ఈరాన్, ఇరాక్ దేశాల్లో, సాసానీ రాజుల కేంద్రం మదాయన్‌లో జోరాష్ట్రియన్ మతానికి చెందిన పెద్ద పెద్ద అగ్ని ఆరాధనా లయాలు ఉండే చోట ప్రప్రథమంగా ఆయన జామ మస్జిద్ నిర్మించారు. ఆ తరువాత మహనీయ హుజైఫా బిన్ అల్ యమాన్ మదాయన్ గవర్నర్ అయినప్పుడు ఆయన ఆ మస్జిద్‌ని ఇంకా విశాలం, పటిష్టం చేశారు. కొంత కాలానికే సైనిక సేవలు అందించే అనేక అరబ్బు తెగలు మదాయన్‌లో స్థిర పడిపోయారు. వారు కూడా స్వయంగా తమ అవసరార్థం మస్జిదులు నిర్మించుకున్నారు.

కాని అరేబియా ఎడారులకు భిన్నంగా ఇక్కడి వాతావరణం తేమగా ఉండేది. అందువల్ల ముస్లిములు కాస్త బలహీనంగా, వ్యాధిగ్రస్తులుగా ఉండేవారు. కడకు మహనీయ సఅద్(ర) అమీరుల్ మూ'మినీన్ మహనీయ ఉమర్ ఫారూక్(ర)కు ఈ విషయాన్ని గురించి వ్రాయవలసి వచ్చింది. దానికి సమా ధానం వచ్చింది, అందులో అరబ్బుల ఆరోగ్యాన్ని పురస్క రించుకుని వారి నివాసానికి యోగ్యమయిన చోటికి వారిని తరలించవలసిందిగా కోరడమయినది.

## కూఫా నగరం

నేడు కూఫా నగరమున్న చోట ఈ ఆవశ్యకతకు తగినదిగా ఎన్నుకోవడం జరిగింది. ఇక్కడ మహనీయ సఅద్(ర) పర్య వేక్షణలో నలభై వేల జనుల కొరకు ఇళ్ళు నిర్మించబడ్డాయి. తొలుత వీటిని తుంగ గడ్డితో నిర్మించారు. యాదృచ్ఛికంగా ఒక సారి నిప్పు అంటుకోవడం వల్ల, మహనీయ ఉమర్(ర) అనుమతితో ఇటుకలు, గచ్చుతో ఆ ఇండ్లు నిర్మించడం జరిగింది. ఈ కొత్త నగరంలో జనం తెగలవారీగా నివసిం చారు. ప్రతి తెగలో ఒక మస్జిద్ నిర్మించడం జరిగింది. అయితే కూఫా నగరంలో అన్నింటికన్నా పెద్ద మస్జిద్ జామ మస్జిద్‌గా నిర్మించారు. ఇందులో యాభై వేల మంది నమాజ్ చేయ గలరు.

ఈ కొత్త నగరం కూఫాకు ఆ రాష్ట్ర కేంద్రంగా నిర్ణయించు కున్నారు. మరి మహనీయ సఅద్(ర), దాని గవర్నర్ గా నియమించబడ్డారు. మరో మస్జిద్ బహుశా మహనీయ సఅద్(ర)తన స్వంత ఖర్చులతో 'అకీక్' అనే చోట నిర్మించారు. ఇక్కడ ప్రవక్తశ్రీ(స) ఆయనకు కొంత భూమి ప్రసాదించి ఉన్నారు. అందులో ఒక బావి కూడా ఉండేది. ఈ మస్జిద్ ఆ బావికి దగ్గరగా నిర్మించడం జరిగింది. కడకు ఆయన ఆ బావి, ఆ భూమిని ముస్లిముల కొరకు వక్ఫ్ (దానం) చేసివేశారు.

## ఆయన ఆధ్వర్యంలో మరిన్ని యుద్ధాలు

ఆయన సేనల వ్యవస్థీకరణలో, ధర్మ స్థాపనా కార్యంలో నిమగ్నమయి ఉండగా, ఈరానీయులు 'జలూలా' అనే చోట పెద్ద ఎత్తున యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. ఇంకా వారు ఆజర్ బైజాన్, బాబుల్ జిబాల్ నుంచి ఆయుధాలు, సైనిక కమాండర్లు రప్పించి పెద్ద ఎత్తున బలగాలు సమకూర్చుకున్నారని కూడా తెలిసింది. చక్రవర్తి యజ్ద్ గర్ద్ మహ్రాన్ రాజీని భావి సేనాధిపతిగా నియమించా రని, జలూలా నగరం చుట్టూ కందకం త్రవ్వించారని, ఇంకా రహదారుల్లో ఇనుప ముండ్లు పరచి పెట్టారని కూడా తెలిసింది.

ఈ సమాచారం ధ్రువీకరణ తరువాత మహనీయ సఅద్(ర) ఖలీఫాకు తెలిపారు. ఖిలాఫత్ కేంద్రం నుంచి అందిన జవాబులో, "మీరు యథావిధిగా ఇస్లామ్ సందేశ ప్రచారం, ముస్లిముల సుశిక్షణ కార్యక్రమంలో మగ్నులయి, హాషిమ్ బిన్ ఉత్బా నాయకత్వంలో ముప్పై వేల సైనికులనిచ్చి పంపించవలసిందని, ఇంకా ఆయన ప్రతి రోజు మీకు నివేదిక పంపిస్తూ ఉండాలని మరి అవసరం రీత్యా మీ నిర్దేశాలు గ్రహిస్తూ ఉండాలని" ఆదేశముంది.

హాషిమ్ ఎనభై దినాల వరకు, ఒక లక్షా పదిహేను వేల సైన్యాన్ని తన చుట్టుముట్టులో పెట్టారు. ఆ పైన భీకర

యుద్ధం జరిగింది. మహనీయ సఅద్ ఆచరణాత్మక విజ్ఞత రీత్యా ఓ చీకటి రేయిన తుఫాను హెూరులో దేవుని దాసులు కొంత వరకు ఇనుప ముండ్లను తీసివేసి, కొంత కందకాన్ని పూడ్చివేయగలిగారు. ఆ పైన హాషిమ్ ఈరానీయుల పైన బలోపేతంగా దాడి జరిపారు. మహ్రాన్ సేనలు బిత్తర పోయి పరుగులు తీశారు! అనేక మంది కందకంలో పడిపోయారు. కడకు కందకం గుర్రాలతో మనుషులతో మూసుకు పోయింది! అప్పుడు జరిగిన హతుల సంఖ్య అగణ్యమయింది. బతికి బయట పడిన వారు బహు స్వల్పం. వారిని కూడా ఖైదీలుగా పట్టుకోవడం జరిగింది.

## కుప్ప కూలిన ఈరాన్ సేన

ఆ తరువాత వెంటనే సేనాధిపతి కా'కా' మహనీయ సఅద్ ఆదేశానుసారం, హల్వాన్ వెళ్ళి దాడి చేశారు. యజ్ద్ గర్ద్ 'రే' నగరం వైపునకు పారిపోయాడు. అతని సేనాధిపతిని ఓడించి కా'కా' హల్వాన్‌ని అధీనపరచుకున్నారు. ఆ సందర్భంలో అనేక మంది నాయకులు, పెద్దలు ఇస్లామ్ స్వీకరించి మహనీయ సఅద్(ర)కు తమ విధేయత, ఇస్లామీయ సోదరత్వంలో చేరికను గురించి తెలుప వలసిందిగా వేడుకున్నారు.

హల్వాన్ ను జయించిన తరువాత మహనీయ సఅద్(ర) అక్కడికి వెళ్ళారు. జలూలా, హల్వాన్‌లోని యుద్ధ ప్రాప్తిని ఒక చోట ప్రోగు చేసి, మహనీయ సఅద్(ర) అయిదవ వంతు మదీనాకు పంపించేందుకు వేరు చేయించి, మిగతా సామగ్రి సేనలో పంచిపెట్టారు. ప్రతి ఒక్కరికీ తొమ్మిది వేల దిర్హములు, తొమ్మిదేసి గుర్రాలు లభించాయి. మహనీయ సఅద్(ర) వార్తావహుడు, విజయ సమాచారం, ఖుముస్ (అయిదవ వంతు యుద్ధ ప్రాప్తిని) తీసుకుని మదీనా చేరే టప్పటికి సాయంత్రం అయింది.

మహనీయ ఉమర్(ర), మొత్తం సామగ్రిని ఇప్పుడే పంచి వేయాలని కోరారు. మస్జిద్ ప్రాంగణంలో అంతా కుప్ప వేశారు. కోట్లు ఖరీదు చేసే సామగ్రి అక్కడే పడి ఉండింది. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, అబ్దుల్లా బిన్ అర్కమ్ (ర) రాత్రి అంతా కాపలా కాశారు. తెల్లవారు అందరూ సమావేశమయ్యారు. అక్కడి మణి మాణిక్యాలు చూసి జనుల కళ్ళు చెదిరిపోయాయి. కాని అమీరుల్ మూ'మినీన్, ఫారూక్(ర) విలపించసాగారు. మహనీయ ఇబ్ను ఔఫ్(ర), ''అమీరుల్ మూ'మినీన్! ఇది సంతోషించ వలసిన సమయం, మీరు విలపిస్తున్నారేమిటీ?'' అని అడిగారు. దానికి ఆయన(ర), ''ఏ జాతికి దైవం సంపదనిస్తాడో వారిలో ఈర్ష్యా ద్వేషాలు చోటు చేసుకుంటాయి. అప్పుడు ఆ జాతిలో అన్యాయం, కాపట్యం పునాది వేసుకుంటాయి. నేను దానికే భయపడుతున్నాను'' అన్నారు. ✤


### చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

### Bank Details

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# 'చరితార్థులు'-2



# బేగం రెహానా అబ్బాస్ తయ్యబ్జీ

## (1900 -1975)

**93**




జాతీయోద్యమంలో తాత, తల్లితండ్రులతో పాటుగా మాత్రమే కాకుండా మెట్టినింట చేరాక కూడా భర్త కుటుంబీకులతో కూడా కలసి పోరుబాట నడిచిన బేగం రెహానా అబ్బాస్ తయ్యబ్జీ 1900 జనవరి 27న గుజరాత్‌లో జన్మించారు. ఆమె తల్లి అమిన తయ్యబ్జీ, తండ్రి జస్టిస్ అబ్బాస్ తయ్యబ్జీ. ఆధునిక విద్యతోపాటుగా సాంప్రదాయిక విద్యను కూడా అభ్యసించిన రెహానా గ్రాడ్యుయేషన్ చేయటంతోపాటుగా ఆంగ్ల, హిందీ, గుజరాతీ, ఉర్దూ భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. చిన్ననాటనే రెహానాకు గాంధీజీతో పరిచయం కలిగింది. ఆమెను ప్రియపుత్రి, చిరంజీవి, రెహానా బేటీగా, బేటీ రెహానా, ఉస్తాది సాహెబా, పాగల్ రెహానా, భోలి బేట అని గాంధీజీ సంబోధించారు. మహాత్ముని సేవాగ్రాం ఆశ్రమంలో రెహానా తయ్యబ్జీ గడిపిన సందర్భంగా ఆమె గాంధీజీకి ఉర్దూ భాష నేర్పారు. ఆ కారణంగా అమెను ఉస్తాదినీ సాహెబా అని గాంధీజీ తన లేఖలలో సంబోధించారు. ఆమె అన్ని మతాల పట్ల సమాన గౌరవం చూపారు. ఆమె తాత్వికత విశ్వమానవ సోదరభావం దిశగా సాగింది. ఆమె చక్కని రచయిత్రి. ఆధ్యాత్మిక గీతాలు మాత్రమే కాకుండా జాతీ యోద్యమంలో ఉద్యమకారులను ఉత్తేజ పర్చేందుకు ఉద్యమ గీతాలు కూడా రాశారు. గుజరాత్‌లో మద్యపాన నిషేధ ఆందోళన, విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమాల నిర్వహణకు మహిళల సమావేశాన్ని గాంధీజీ ఏర్పాటు చేసిన సందర్భంగా ఆమె ప్రధాన పాత్ర వహించారు. భారత దేశానికి మార్గదర్శకమైన ఈ ఉద్యమం సందర్భంగా మహిళలను సంఘటితం చేసేందుకు రెహానా ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తించారు. భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగం యూత్ లీగ్‌కు ఆమె నాయకత్వం వహించారు. 1942 నాటి క్విట్ ఇండియా ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నందుకు ఆమె లాఠీ దెబ్బలను రుచి చూశారు. జైలు శిక్షలను అనుభవించారు. అరెస్టులు, లాఠీ దెబ్బలు, జైళ్ళు స్వాతంత్ర్యోద్యమ కారులకు సత్కారాలుగా భావించిన రెహానా తయ్యబ్జీ చివరి వరకు జాతీయోద్యమంలో విరామమెరుగక పాల్గొన్నారు. భారత జాతీయోద్యమంలో ఆమె తనదైన బృహత్తర పాత్ర నిర్వహించారు. సూఫీ తాత్విక భావజాలంతో ప్రభావితురాలైన అమె సర్వమానవ సోదర భావానికి, విశ్వశాంతి పరిరక్షణకు కృషి సల్పారు. మాతృ భూమికి స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు లభించాక ప్రజలు అన్ని రుగ్మతల నుండి విముక్తి పొందాలని ఆకాంక్షిస్తూ చివరి క్షణం వరకు తనదైన మార్గంలో ఉద్యమించిన బేగం రెహానా తయ్యబ్జీ 1975 మే 16న అవివాహితగా కన్ను మూశారు.




**9440241727**


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2** (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

30 – 32 వారు అక్కడికి చేరి ఇలా అన్నారు, "మా జాతివారలారా, మేమొక గ్రంథాన్ని విన్నాము. అది మూసా తరువాత అవతరించింది. దానికన్నా ముందు వచ్చిన గ్రంథాలను ధ్రువీకరిస్తోంది, సత్యం వైపునకు, రుజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది.[34] మా జాతివారలారా, అల్లాహ్ వైపునకు పిలిచేవాని సందేశాన్ని స్వీకరించండి, దీన్ని విశ్వసించండి, అల్లాహ్ మీ పాపాలను మన్నిస్తాడు, మిమ్మల్ని బాధాకరమయిన యాతన నుండి రక్షిస్తాడు."[35] మరెవరయితే అల్లాహ్ వైపునకు పిలిచేవాని మాటను వినడో అతను భువిలో స్వయంగానూ ఎటువంటి బలం కలిగి ఉండడు అల్లాహ్‌కు ఇబ్బంది కలిగించడానికి, ఇంకా అతన్ని అల్లాహ్ నుండి కాపాడుకునే ఏ సహాయకులూ, సంరక్షకులూ లేరు. ఇలాంటి జనులు విస్పష్టమయిన మార్గవిహీనతలో పడి ఉన్నారు.

34. దీన్నిబట్టి ఆ జిన్నులు లోగడ హజ్రత్ మూసా(అ)ను, దైవ గ్రంథాలను నమ్మినటువంటివారు అని తెలుస్తోంది. ఖుర్ఆన్‌ని విన్న తరువాత వారు, ఇది వెనుకటి ప్రవక్తలు అందజేస్తూ వచ్చిన బోధనలే అని గ్రహించారు. అందువల్లనే వారు ఈ గ్రంథాన్నీ దాన్ని అందజేసే దైవసందేశహరుల (స)నూ విశ్వసించారు.

35. విశ్వసనీయ ఉల్లేఖనాల ద్వారా తెలిసేదాన్నిబట్టి, ఆ తరువాత జిన్నుల బృందాలు ఒకదానివెంట మరొకటి ప్రవక్త మహనీయులు (స) వద్దకు హాజరవసాగాయి, వారితో ముఖాముఖి సమావేశాలు జరగసాగాయి. ఈ సందర్భంలో, హదీసు గ్రంథాల్లో ఉటంకించబడిన ఉల్లేఖనాలను సంకలనం చేస్తే తెలిసేదేమిటంటే హిజ్రత్‌కు పూర్వం మక్కా మహా నగరంలో కనీసం ఇటువంటి బృందాలు ఆరు వచ్చి కలుసుకున్నాయి.

వాటిలో ఒక బృందం గురించి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఇలా సెలవిస్తున్నారు, ఒకరోజు దైవసందేశహరులు (స) మక్కాలో రాత్రంతా కనిపించలేదు. మేము బాగా ఆందోళన చెందాము, ఆయనపై దాడి ఏమయినా జరిగిందేమోనని. తెల్లవారు జామున మేము ఆయన్ని, హిరా (కొండ) నుండి వస్తూ ఉండగా చూశాము. అడిగితే ఆయన, ఒక జిన్ను నన్ను పిలవడానికి వచ్చాడు. నేను అతనితో పాటు ఇక్కడికి వచ్చి ఒక వర్గానికి ఖుర్ఆన్ వినిపించాను. (ముస్లిమ్, ముస్నద్ అహ్మద్, తిర్మిజీ, అబూదావూద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఉటంకించినదే మరో ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(శ్రీ) (స) ఒకసారి సహచర మహనీయుల్ని ఈ రేయి జిన్నుల్ని కలుసుకోవడానికి నాతోపాటు మీలో ఎవరు వస్తారో చెప్పండి అని అడిగారు. నేను ఆయనకు తోడుగా వెళ్ళడానికి సిద్ధమయ్యాను. మక్కా నగరం పైభాగాన ఒకచోట ప్రవక్త(శ్రీ) (స) ఒక గీతగీసి దాన్ని దాటవద్దని పురమాయించారు. ఆ తరువాత ఆయన ముందుకు సాగారు. నిలబడి ఖుర్ఆన్ చదవసాగారు. నేనూ గమనించాను, చాలామంది ఆయన చుట్టు చేరి నిలబడ్డారు. నాకూ ఆయనకు మధ్యన వారంతా అడ్డుగా ఉన్నారు. (ఇబ్ను జరీర్, బైహకీ, దలాయిలున్నబువ్వహ్, అబూ నుయైమ్ అస్ఫహానీ, దలాయిలున్న బువ్వహ్)

మరో సందర్భంలోనూ రాత్రివేళ హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ ప్రవక్త మహనీయుల (స)తో పాటు ఉన్నారు. మక్కాలో "హజూన్" అనే చోట జిన్నుల ఒక కేసును ఆయన (స) విచారించి తీర్పు చెప్పారు. అది జరిగిన ఎన్నో ఏళ్ళకు ఇబ్ను మస్ఊద్ (ర) కూఫాలో జాట్ ప్రజల ఒక వర్గాన్ని చూసి, 'హజూన్' ప్రాంతంలో తాను చూసిన జిన్నుల వర్గం వీరిని పోలి ఉండిందని అన్నారు (ఇబ్ను జరీర్).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ
## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

**2. అల్ బఖరా సూరా వ్యాఖ్యానం**

**అధ్యాయం : 3**


## (ప్రజలారా!) ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి

**328) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా అన్నారు : నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్)ను, 'అల్లాహ్ దృష్టిలో అన్నింటికన్నా పెద్ద పాపం ఏది?' అని అడిగితే, "నిన్ను పుట్టించినవాడు అల్లాహ్‌యే అయినప్పటికీ నీవు అల్లాహ్‌కు సమానులుగా వేరొకరిని కల్పించటం" అని ఆయన(స) చెప్పారు. 'అవును, నిజంగా ఇది ఘోర అపరాధమే' అని నేను అన్నాను. 'ఆ తర్వాత అన్నింటికన్నా మహాపరాధం ఏది?' అని నేను ప్రశ్నించగా, "నీ సంతానం నీతో కలసి తినేస్తుందనే భయంతో సంతాన హత్యకు పాల్పడటం" అని ఆయన(స) సమాధానమిచ్చారు. 'ఆ తర్వాత?' అని నేను సందేహపడగా, "నీవు నీ పొరుగువాని భార్యతో వ్యభిచరించటం"[1] అని ఆయన(స) చెప్పారు.**

328-1. అరబీ మూలంలో 'నిద్' అని ఉంది. నిద్ అంటే జత, సమానం అని అర్థం. 'అందాద్' బహువచనం. అల్లాహ్ తప్ప వేరొకరిని దైవంగా భావించటం ఒక్కటే దీని అర్థం కాదు. అరేబియాలోని చాలామంది ముష్రిక్కులు, ఇతర రాజ్యాల లోని ముష్రిక్ ప్రజలు కూడా 'దేవుడు ఒక్కడే' అని తలపోసే వారు. ఉదాహరణకు ఖుర్ఆన్‌లోని ఒక ఆయత్: ''ఆకాశాలనూ, భూమినీ సృష్టించినదెవరు?'' అని నీవు వారిని అడిగితే, ''అల్లాహ్'' అని వారు ఠకీమని చెబుతారు. (31: 25). అలా చెప్పినప్పటికీ అల్లాహ్ వారిని బహుదైవారాధకులుగా ఖరారు చేశాడు. ఎందుచేత? ఎందుచేతనంటే అల్లాహ్ గుణగణాలలో ఉదాహరణకు- అంతా వినేవాడు, అన్నీ ఎరిగినవాడు, అన్నింటినీ పరివేష్ఠించి ఉన్నవాడు- ఈ గుణగణాలను ఎవరయినా ఇతరులకు కూడా కల్పిస్తే, అతడు కూడా అల్లాహ్‌కు సమాన భాగస్వాములుగా చేర్చాడు. ఉదాహరణకు- ఫలానా పీర్ సాబ్ లేదా పైగంబర్ దూరాన ఉన్న వస్తువును కూడా చూడ గలుగుతా రని, లేదా దాని గురించి తెలుసుకుంటారని, వారు తలచుకున్నది చేస్తారని అంటే వారు కూడా ముష్రిక్‌లు (బహుదైవారాధకులు) అయిపోతారు. అలాగే ఎవరయినా అల్లాహ్‌ను గాకుండా వేరితరులను పూజిస్తే, వారి పేరు మీద ఉపవాసం పాటిస్తే, వారి పేరున మొక్కుకుంటే, వారి పేరు మీద పశువును కోస్తే, వారి సమాధిపైన గిలాపులు తొడిగిస్తే, పొద్దస్తమానం వారి పేరును జపిస్తూ ఉంటే- అలాంటివారు కూడా ముష్రిక్కులుగానే పరిగణించబడతారు.

ఇక తౌహీద్ (దేవుని ఏకత్వం, ఏకదైవారాధన) ఏదంటే; అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ మొరపెట్టుకోరాదు. వేరితరులను పూజించరాదు. సర్వస్తోత్రములు అల్లాహ్‌కే చెందునని నమ్మాలి. అందరూ అల్లాహ్ పైనే ఆధారపడి ఉన్నారని, లాభనష్టాలను చేకూర్చే శక్తి, అధికారం అల్లాహ్ చేతుల్లో మాత్రమే ఉందని విశ్వసించాలి. సంతాన భాగ్యం పొసగటం, వర్షం కురిపించటం, ఉపాధిని వికసింపజేయటం, ఒకరిని బ్రతికించడం, మరణ మొసగటం- అంతా అల్లాహ్ అధీనమై ఉందని గట్టిగా నమ్మాలి.

తౌహీద్‌లోని రెండు రకాలు సదా స్మరించుకోదగినవి. ఒకటి; 'తౌహీదె రుబూబియత్'- అంటే అల్లాహ్‌ను ప్రభువుగా, సృష్టికర్తగా, యజమానిగా నమ్మి నడుచుకుంటే, ఇది మాత్రమే సరిపోదు... రెండు; 'తౌహీదె ఉలూహియత్'. అంటే అల్లాహ్‌ను ఏకైక ఆరాధ్య దైవంగా, పూజనీయుడుగా, లోకేశ్వరునిగా నమ్మాలి. సకల ఆరాధనలను ఆ నిజ ఆరాధ్య దైవం కొరకే ప్రత్యేకించుకోవాలి. 'కలిమయె తయ్యిబా' (**లా ఇలాహ ఇల్లల్లాహ్**) సారాంశం ఇదే. దైవప్రవక్తలంతా ఈ తౌహీదె ఉలూహియత్ వైపునకే ప్రజలకు పిలుపు ఇచ్చారు.



# భారతీయ విద్యా విధానం - భాషా పరిణామ చరిత్ర -1

**వలస పాలనలోని** లాహోర్, గతంలోకి ఓ చూపు, ఉర్దూ, పర్షియన్, సంస్కృత భాషలు ఒకే చోట బోధించిన వేళ (1860లో ఓరియంటల్ కాలేజీ వ్యవస్థాపకులు, ప్రజాబాహుళ్యంలో వివిధ భాషా వాతావరణం నెలకొని ఉందని భావించారు.)

- విపిన్ కృష్ణ

బ్రిటిష్ లైబ్రరీలోని అండర్ హిల్ ఆల్బమ్‌లో, బ్రిటిష్ పాలకులు, ప్రాంతీయ భాషా వర్గాలను ఏ విధంగా అర్థం చేసుకున్నారో తెలియపరిచే ఒక సమగ్ర చిత్రం కనిపిస్తుంది.

## బ్రిటిష్ లైబ్రరీ సౌజన్యంతో

భారతదేశంలో 2027లో జరగబోయే జాతీయ జనగణన సన్నాహాలు జరుగుతున్న తరుణంలో, భాష అనేది మరోసారి రాజకీయ జ్వాలగా మారింది. నేడు, మాతృభాష, విద్యాబోధన మాధ్యమం ఇంకా భాషాపరమయిన గుర్తింపు ఇత్యాది విష యాల పట్ల చర్చలు ఉధృతమయ్యాయి. ముఖ్యంగా జనగణనలో విద్య, సాంస్కృతిక గుర్తింపు కూడా వర్గీకరించబోతున్నందువల్ల ఈ చర్చ మరీను!

ఏ భాషల్ని పరిగణనలోకి తీసుకుంటారు? ఏది ఏ విధంగా పరిగణించబడుతుంది, మరిదేన్ని వదిలి పెట్టడం జరుగుతుంది, లేదా దేన్ని ఇతర భాషలతో జత చేయడం జరుగుతుందీ? అన్నవి చర్చనీయాంశాలు.

## గత చరిత్ర నెమరువేత

ఒకటిన్నర శతాబ్ది కన్నా పైనే అయింది, బ్రిటిష్ పాలనలోని లాహోర్‌లో భాష పట్ల మరో విధంగా యోచించడం జరిగింది. 1860 లో "ది ఓరియంటల్ కాలేజీ" ని స్థాపించారు. అందులో ఓ ఉన్నత విద్యా నమూనాను ప్రవేశపెట్టడం జరిగింది. అందులో ఉర్దూ, పర్షియన్, పంజాబీ, సంస్కృతం, అరబీ అన్నీ సమంగా నేర్ప బడేవి. కాలేజీ వ్యవస్థాపకులు ప్రజా బాహుళ్యంలో అనేక భాషలు చెలామణిలో ఉన్నాయని నమ్మేవారు.

ఈ కాలేజీ, ఆధునిక శాస్త్రాలను బోధించేందుకు కావలసిన విద్యా ప్రణాళిక తయారు చేసింది. ఇంగ్లీషు మాధ్యమంలో విద్యా బోధన జరుగుతున్న రోజుల్లో, అది నీతి శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం వంటివి ఆ నాటి ప్రజలు మాటలాడుకునే వ్యావహారిక భాషల్లో నేర్పాలన్న ప్రణాళిక!

ఇదేదో భావోద్వేగమయిన లేదా వెనుక చూపు భావన కాదు. ఈ కాలేజీ పెద్దలు వివిధ భాషల విద్య, విభిన్న సముదాయాల అవసరాలను తీర్చడానికి, భావి పాలనాధికారుల తర్ఫీదు కొరకు, నాగరిక జీవిత నిర్మాణానికి అవసరమని భావించారు. ఆ కాలేజీ పత్రికలు, పాఠ్య పుస్తకాలు వ్యాకరణం, సాహితీ శైలీ, స్వయంగా భాష పట్ల చర్చలకు వేదికలయ్యాయి.

## ప్రస్తుత పరిస్థితి

నేడు జనగణన భాషా వర్గీకరణ, దాగి ఉన్న భాషా దురభిమానాలను తీవ్రతరం చేస్తుందన్న భయంకర పూర్వ రంగంలో, ఓరియంటల్ కాలేజీ, లాహోర్, చరిత్ర గతానికి వెనుతిరగడం కాదు, నిజానికి అది ఓ కాలంలో భిన్నత్వం, విద్యాలయ రూపంలోనూ ఉండేది అని గుర్తు చేస్తోంది!

## లాహెూర్ లో ప్రాంతీయ భాషల్లో విద్యా బోధనకు మూలం

దక్షిణ ఆసియాలో ప్రాంతీయ భాషా శిక్షణ గరిపే విద్యాలయాల చరిత్ర లార్డ్ మెకాలే 1835లో సమర్పించిన పాలిసీ దస్తావేజుతో మొదలవుతుంది. థామస్ బేబింగ్టన్ మెకాలే సమర్పించిన నివేదిక ప్రకారం, బ్రిటిష్ పాలిత భారత దేశంలో వలస వాద విద్యా విధానాన్ని మరీ దృఢతరం చేసే ఇంగ్లీషు భాషను నేర్చుకోవడం పట్ల భారతీయులు సుముఖంగా లేరని అన్నట్లు ప్రతీతి.

ఏది ఏమయినా తరచుగా ఇంగ్లీషు ఆలోచనా విధానాన్ని అనుసరించే పాశ్చాత్య విద్యా విధానం నమూనాలను ఎంతగా ప్రవేశపెట్టినా, ప్రాంతీయ భాషా విద్యాలయాలు 19వ శతాబ్దిలో బాగా సుస్థిర పడ్డాయి.

## ప్రాంతీయ భాషా విద్యాలయాలు

మిషనరీ విద్యాలయాలు పెరుగుతూ ఉన్న కొద్దీ ప్రాంతీయ భాషా విద్యాలయాలను స్థాపించే ఆవశ్యకత కూడా పెరగసాగింది. ఆ పైన సరిగ్గా 1857 తిరుగుబాటు తరువాత బ్రిటిష్ ప్రభుత్వం భారత పరిపాలనా పగ్గాలు చేపట్టగానే లాహెూర్ భూమికగా ఓ విశ్వ విద్యాలయ భావన రూపు దాల్చసాగింది.

ఇదంతా జరిగింది, బ్రిటిష్ ఇండియాలో ముద్రణాలయాలు, విద్యా బోధనల విజృంభణ మధ్యన! లిథోగ్రాఫిక్ ముద్రణాలయాలు పెరగ సాగాయి, అదేవిధంగా ఆవిరి యంత్రాల సాంకేతిక పరిజ్ఞానం సయితం పెరిగింది. ఈ సందర్భంగా ముద్రణా యంత్రాల ఉధృతి - వ్యాకరణం, లిపి, భాషకు సంబంధించిన అతివాద రాజకీయాలకు ఓ ప్రదర్శనా వేదికను మతపరమయిన రీతిలో సమకూర్చింది.

కాని 19వ శతాబ్ది చివరన కూడా, విద్యార్థులు, స్థానిక కులీనులు, వలస ప్రభుత్వాధికారులు, అందరూ పర్షియన్, సంస్కృతం, హిందీ, పంజాబీ, ఉర్దూ భాషలు ఇంగ్లీషుతోపాటు బోధించే విద్యాలయాల స్థాపన జరగాలని గట్టిగా కోరేవారు.

## దేశీయ విద్యాబోధన

జీ. డబ్ల్యు. లెయిట్నర్ (GW Leitner) హంగేరిలో పుట్టిన బ్రిటిష్ భాషా వేత్త, విద్యాలయ తొలి ప్రిన్సిపాల్‌గా నియమించ బడ్డాడు. పూర్వం ఆయన, కింగ్స్‌కాలేజీ, లండన్‌లో అధ్యాపకుడుగా ఉండేవాడు. ఆయన 'కేవలం ఇంగ్లీషు' విధానాన్ని కాదని, దేశీయ విద్యాబోధనను ప్రోత్సహించే వాడని ప్రతీతి.

ప్రాంతీయ భాషా బోధనకు విద్యాలయ మౌలిక సదుపాయాల నిర్మాణం అవసరమని నమ్మేవాడు లెయిట్నర్.

ఆయన 'అంజుమన్-ఎ- పంజాబ్' (పంజాబ్ సాహితీ సంఘం)ని స్థాపించాడు. పత్రికలు ప్రారంభించాడు, ఒక మదరసా మొదలెట్టాడు. ఆయన, యూరోపియన్ పాలనా యంత్రాంగం ద్వారా, ఆయా ప్రాంతీయ భాషా ఆవశ్యకతల పరిపూర్తి జరిగే, ఇంకా పర్షియన్, సంస్కృతం, ఉర్దూ భాషలతోపాటు, యూరోపియన్ విజ్ఞాన శాస్త్రాలు, మత బోధనల తులనాత్మక అధ్యయనం జరిగే ఓ విశ్వవిద్యాలయం కలగన్నాడు.

## అంజుమన్ రెండవ జల్సా(సమావేశం)లో దిగువ నిర్ణయాలు నమోదయ్యాయి

ఒక కమిటీ, విద్యావిషయిక పరిషత్తును స్థాపించి దాని నిబంధనలు రూపొందిస్తుంది. వ్యాకరణ పుస్తకాలు సంస్కృతం, అరబీ, పర్షియన్ భాషల్లో తయారు చేయబడతాయి. పంజాబ్ అంతటా స్కూళ్లలో సాహిత్యం పెంచడానికి పథకం రూపొందించబడుతుంది. మూడు భాషల్లోనూ పరీక్షలు నిర్వహించబడతాయి.

## బ్రిటిష్ పాలనా యంత్రాంగం

ప్రారంభం నుంచే ఎజెండా ఎంతో ఆశావహమయినదీ బహుభాషా ప్రధమయినదీను.

బ్రిటిష్ పాలనా యంత్రాంగం విభక్తమయి ఉండేది. అందులో ఒక గ్రూపు, అంజుమన్ ఎన్ని జల్సాలు నిర్వహించినా, ప్రాంతీయ భాషా శిక్షణా విద్యాలయాలు ప్రారంభించడానికి కావలసిన నిధులు కేటాయించడం పట్ల సుముఖంగా లేదు.

ప్రాంతీయ అధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా తెలిసే దాన్ని బట్టి అటువంటి సంస్థలలో ఉత్పన్నమయిన గ్రాడ్యుయేట్లు ఏ విధంగా తమ "తోటి నాగరికులకు" దూరమవుతారో అన్న అనుమానం వారు వెలిబుచ్చారు.

## ప్రజలతోనూ ప్రభుత్వంతోనూ దూరం

ఒక ప్రాంతీయ ప్రభుత్వ లేఖ తేదీ ఫిబ్రవరి 11, 1868 ఈ విధంగా వెల్లడించింది: "ఈ కొత్త నమూనా ప్రకారం, ఉన్నత విద్య నభ్యసించిన వారంతా తమ తోటి నాగరికులతో వేరయి పోయారు. అందువల్ల నైతికంగా ఈ విద్య ద్వారా ఏర్పడిన నైతిక ప్రభావాలు లోపభూయిష్టమయినవి."

ఇదంతా జరగడానికి కారణం, సాధారణ జనావళి కొరకు పాశ్చాత్య భూమికతో ఏర్పడిన ప్రాంతీయ భాషా విద్యాలయాలు, దైనందిన వ్యవహారాలలోనూ ప్రాంతీయ భాషల్లోనూ ప్రాంతీయ దురభిమాన ప్రవృత్తుల్ని లోతుగా స్థాపించడం ద్వారా జనుల్ని పరస్పరమూ దూరం చేసి, బ్రిటిష్ ప్రభుత్వానికీ దూరం చేస్తాయని భావించడం జరిగింది.

ప్రాచీన రికార్డు ఒకే విధమయిన దృక్పథాన్ని ఇక్కడ చూపించడం లేదు, ఇంకా బ్రిటిష్ పాలనా యంత్రాంగంలోని ఉభయ వర్గాలు విభక్తమయి ఉన్నాయి. వాటిలో ఒకటి, ప్రాంతీయ భాషా శిక్షణ మాట వస్తే తటపటాయింపుకు గురయింది.

**తెలుగు సేత : ఎస్.ఎమ్.మలిక్**

కథ

షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల



# క్షణం...క్షణం మధురం

**ఖాజాహుసైన్** ఎదురుగా టేబుల్ పై ఉన్న పుస్తకాల సెట్టు ఓ సారి చేతిలో తీసుకుని అలా స్పృశించి పెట్టేసారు. అన్నీ చిన్న చిన్న పుస్తకాలు. చాలాసార్లు అలా తన్మయత్వంలో తట్టడం ఇలా అనుభూతికి లోనవడం ఖాజా హుసైన్‌కు అలవాటు. కాకతాళీ యంగా ఆ పుస్తకాలు చేతిలో తీసుకున్న ఖాజాహుసైన్ ఆలోచనలు అలా గతంలోకి వెళ్ళి పోయాయి.

★★★

నాలుగైదు ఏళ్ళ నాటి మాట. రెండు సంవత్సరాలు ప్రపంచాన్ని స్తంభింపచేసిన కరోనా మహమ్మారి కబంధ హస్తాల నుండి బయట పడిన జనావళి ఇప్పుడిప్పుడే జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. వ్యాపారులు చిన్నగా తమ తమ వ్యాపారాలలో లీనమైపోతున్నారు. ఖాజాహుసైన్ ఫ్యాక్టరీ పని కూడా ప్రారంభించబడింది. పరిశ్రమల నిర్వహణ అంత సులభంగా ఏమీ లేదు. ప్రభుత్వాలు మారినప్పు డల్లా రూల్స్ రెగులేషన్స్ మారిపోతుంటాయి, వాటిని తట్టు కుంటూ ముందుకు పోయినవారే నిలదొక్కుకుంటారు. ఎందరో కార్మికులకు జీవనాధారమైన తన సంస్థ కరోనా కాలంలో ఎలాంటి ఉత్పత్తికి నోచుకోక పోయినా కార్మికులు ఇతర చోట్లకు వెళ్ళి పోకూడదని ఖాజా హుసైన్ తన కార్మికుల జీవనోపాధికి సహాయం అందించేవాడు. అది సహాయమైనా ఓ వ్యాపార రహస్యం.

ఖాజా హుసైన్‌లో ధార్మిక పరిజ్ఞానం చాలా తక్కువ. ఫ్యాక్టరీ నిర్వహణలో అందెవేసిన చేయి. రెండు కార్లు, ఇద్దరు మగ పిల్లలు, ఓ అమ్మాయి. తాహతుకు తగ్గట్టు ఆస్తులు, పెద్ద బంగళా, మాడ్రన్ జీవన శైలి సహజంగానే అబ్బాయి. దానికి తగ్గట్టుగానే పెద్ద పెద్ద పరిచయాలు, ఇంట పాశ్చాత్య నాగరికత ఘుమాయింపులు చోటు చేసుకున్నాయి. డబ్బే నేటి స్టేటస్ సింబల్‌గా భావించే వారిలో ఖాజా హుసైన్ ఫ్యామిలీ కూడా చేరిపోయింది. అవసరానికి మించి డబ్బులు ఉంటే ఇంటా బయటా ఆడంబరాలు సహజంగానే పెరిగిపోతాయి.

ఖాజా హుసైన్ ఫ్యాక్టరీకి వెళ్ళే నేపథ్యంలో పై అంతస్తులో ఉన్న డూప్లెక్స్ బిల్డింగ్ నుంచి దిగి వస్తూ మెట్లపై నుంచి జారి క్రింద పడ్డారు. చివరి మెట్లు కాబట్టి ఎక్కడ దెబ్బ తగలలేదు అనుకు న్నారు. కాని రిలాక్స్ కోసం కూర్చున్న కొద్దిసేపటిలోనే విపరీతంగా నొప్పి రావటము వాపు రావటంతో తమ దూరపు బంధువు డా.లతీఫ్‌కు ఫోన్ చేస్తే, ప్రస్తుతం డ్యూటీలో ఉన్నాను, తాను పని చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేయండి అన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రికా అని తటపటాయిస్తున్న ఖాజా హుసైన్‌ను వారించి, గదులు, వసతులు బాగా ఉన్నాయి ఆర్థో వార్డుకు తానే ఇంచార్జి, ఎక్సరే తీసి కట్టేసి వీలైతే పంపిస్తాను, ఓపి తెప్పిస్తాను వచ్చేయి అన్నాడు. ఇంకా తప్పదన్నట్టు భార్య వస్తానన్నా వద్దని డ్రైవర్‌ను తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాడు ఖాజా హుసైన్.

డా.లతీఫ్ ఎక్సరే రాసి తీయించుకొని రాండి అంటూ ఇతర పేషంట్స్‌ను చూడటంలో లీనమైపోయారు. నొప్పి ఎక్కువైతుంది, అటెండర్ వీల్ చైర్‌పై కింది అంతస్తుకు తీసుకొని వెళ్ళాడు. అక్కడా పెద్ద క్యూ ఉంది. ఏదో డా.లతీఫ్ పేషెంట్ కాబట్టి ఓ ఇద్దరి తరువాత ఎక్సరే తీసి పంపినారు, ఫిలిం మధ్యాహ్నం వస్తుంది అంటే, మళ్ళీ డాక్టర్ గారికి ఫోన్ చేస్తే, మీరు పైకి వచ్చేయండి, నేను తెప్పించుకుంటాను అన్నారు. సరే మళ్ళీ పైకి వస్తుంటే ఎవరో గుర్తు పట్టి, ఏం సార్ మీరు ఇక్కడికి వచ్చినారు అని ఇద్దరు ముగ్గురు అడిగినారు. ఖాజా హుసైన్ మనస్సు చివుక్కుమంది.

లతీఫ్ అడ్మిట్ రాసి ఇస్తే ఓ గదిలోకెళ్ళి పరుండినారు ఖాజా హుసైన్. గది అంటే మధ్యన కర్టన్ ఉంది. ప్రక్క మరో పేషంట్ ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, అడ్జస్ట్ కావాలి అనుకున్నారు ఖాజాహుసైన్. భార్య మాటిమాటికి ఫోన్ చేస్తుంది ఎలా ఉందని, ఫ్యాక్టరీ మేనేజర్‌కు తెలిసినట్లు ఉంది. ఫోన్ చేసినాడు

రావాలా సార్ అని, వద్దని వారించినారు. నొప్పి ఎక్కువ ఉందని డ్రైవర్ వెళ్ళి చెబితే, నర్స్ వచ్చి నొప్పి తగ్గటానికి ఇంజక్షన్ వేసి వెళ్ళింది. మరో గంటకు ఓపి చూసుకొని డా.లతీఫ్ గారు వచ్చారు ఖాజా హుసైన్ ఎక్సరే రిపోర్ట్ తీసుకొని. కాలి మడమపై ఎముకలో చిన్న ఫ్రాక్చర్ ఉంది బాబాయ్, ఖాజా హుసైన్‌ను బాబాయ్ అని పిలుస్తాడు డా.లతీఫ్. ఆపరేషన్ అయితే అవసరం లేదు. ఈ రోజు చిన్న బ్యాండేజ్ వేద్దాం. రేపు మరో ఎక్సరే తీసీ ప్లాస్టర్ కట్టు వేసి ఓ పదిహేను రోజులు రెస్టు తీసుకుంటే సెట్ అవుతుంది. లేదా బ్యాండేజ్‌తో చూద్దాం. రేపటి వరకు ఇక్కడే ఉండండి. ఎక్కడికెళ్ళినా ఆపరేషన్ అంటూ హంగామా చేస్తారు అన్నాడు. ఖాజా హుసైన్‌కు ఏమీ సహించలేదు. తెలిసిన డాక్టర్‌ను కాదని వేరేచోటికి వెళ్ళటం సమంజసం అనిపించలేదు. డ్రైవర్‌ను పంపిస్తూ భార్యకు ఫోన్ చేసి విషయం తెలిపి మధ్యాహ్నం రమ్మన్నాడు.

ఆ రోజు ప్రవక్త ముహమ్మద్(స) జన్మదినం అని ఖాజా హుసైన్‌కు తెలియదు. ఆ సమయం ఆసుపత్రి సూపరింటెండెంట్ అనుమతి ఇచ్చారని ఓ ఐదారు మంది విద్యార్థినులు వచ్చారు. మొత్తం హిజాబ్‌లో ఉండి బయట లాంఛనంగా సూపరింటెండెంట్ సూర్యనారాయణచే కార్యక్రమం ప్రారంభించారు. డా.లతీఫ్ మరికొంత మంది డ్యూటీ నర్సులు ఉన్నారు. ఇద్దరు అమ్మాయిలు గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అన్న బ్యానర్ పట్టుకున్నారు. బయటి పేషంట్స్, వారి అటెండెంట్స్ ఒక్కొక్కరికి బ్రెడ్, పండ్లు ఇస్తున్నారు. డా.లతీఫ్, డా.సూర్యనారాయణ గారు జిఐఒ అమ్మాయిల సేవలను అభినందించారు. ఓ అమ్మాయి ప్రవక్త జీవితంపై నాలుగు మాటలు చెప్పి ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఖాజాహుసైన్ రూమ్ ఎదురుగా ఉన్న విశాల ప్రదేశంలో ఈ తంతు పూర్తి అయింది. లతీఫ్ అవసరమైతె ఫోన్ చేయమని హెడ్ నర్స్‌కు సూచనలు ఇచ్చి, ట్యాబ్లెట్లు రాసిచ్చి వెళ్ళిపోయారు.

అమ్మాయిలు తన రూములోకి వచ్చి పండ్లు బ్రెడ్డు వద్దంటున్నా ప్రక్క టీపాయ్ మీద పెట్టి అంకుల్ దైవం మన తప్పులు మన్నించటానికి వ్యాధులు ఇస్తుంటాడు. దైవ నామస్మరణ చేస్తుండండి, లోక కళ్యాణం కొరకు, మా కొరకు దుఆ చేయండి అన్నారు. మరో అమ్మాయి అంకుల్ దగ్గర తోడు ఎవరు లేరు వీలున్నప్పుడు ఈ పుస్తకాలు చదవండి అంటూ రెండు చిన్న పుస్తకాల సెట్లు ఇచ్చి వెళ్ళారు. కొద్దిసేపటికి భార్య భోజనం తీసుకొని వచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సహజంగానే ఉన్న పేషెంట్లు కొద్దిగా రద్దీ ఉంది.

ప్రక్క గదిలో ఉన్న పేషంట్ ఏదో చిన్న ఉద్యోగిగా ఉన్నాడు. చాలా మంది కోస్టాఫ్ వస్తున్నారు. అప్పుడప్పుడు ఆఫీసర్లు. ఖాజా హుసైన్‌కు విచిత్రంగా ఉంది, ఏదో ఆక్సిడెంట్ అయి జాయిన్ అయినట్లుంది. మిత్రులు పిలువడాన్ని బట్టి అతని పేరు రహిమాన్‌లా ఉంది. ఖాజా హుసైన్ భోజనం ముగించినాక స్వీపర్ అన్ని క్లీన్ చేస్తూ మధ్య కర్టన్ సరిచేయలేదు. రహిమాన్ కుమారులు తండ్రి కాళ్ళవైపు కూర్చొని కాళ్ళు చిన్నగా వత్తుతున్నారు. ఆ దృశ్యం ఖాజాహుసైన్‌కు కొత్తగా ఏదో చూస్తున్నట్లుంది. అలాంటి సేవలు పొందే తల్లితండ్రుల దుఆలు పిల్లలకు నిజంగా ఆశిస్సులే! పిల్లలు పెద్దలు ఎదురొచ్చిన వారికి సలాములు, ఆప్యాయత పలకరింపులు. మనవళ్ళు అనుకుంటా నమాజులు చదవలేదని, భోజనం ముందూ దుఆ చేయలేదని ఒకరిపై ఒకరు తాతయ్యతో కంప్లైంట్. జ్యూస్ తీసి ఇచ్చే కోడళ్ళు. చిరు గడ్డాలతో, బురఖాలు ధరించి వచ్చే బంధువులు. వాళ్ళు తెచ్చే పానీయాలు ఖాజా హుసైన్‌కు కూడా అందుతున్నాయి. మధ్యన కర్టన్ లాగిన వారి ఆప్యాయత అనురాగాల దృశ్య మాలికలు ఖాజా హుసైన్ గమనిస్తున్నారు. ఆయన పిల్లలు మధ్యన డాక్టర్లు వస్తే వెంటవెంట వుండి తండ్రి రికవరి గురించి అడుగుతున్నారు. ప్రేమతో ట్యాబ్లెట్లు తినిపిస్తున్నారు.

ఆ ప్రేమ, మధుర సంబంధాలు తాను ఎందుకు పొందలేక పోతున్నా అంటూ మొదటిసారిగా వెలితికి ఫీల్ అయ్యాడు ఖాజా హుసైన్. సాంప్రదాయ అలవాట్లు వారిలో ప్రస్ఫుటంగా అగుపిస్తున్నాయి. తన పిల్లలు సాయంత్రమైనా రాలేదు. మధ్యన ఒకడు ఫోన్ చేసాడు, రావాలా డాడీ! అని. భార్య నాలుగు గంటలకు వెళ్ళి డ్రయివర్తో రాత్రి భోజనం పంపింది. రాత్రి తోడు కోసం పని అబ్బాయి వచ్చాడు. రహిమాన్ జీవిత గుబాళింపులు ఖాజా హుసైన్ ఆఘ్రాణిస్తున్నాడు. రహిమాన్ మధుర జీవితానికి వన్నె తెస్తున్న జీవిత విధానం ఇస్లాం అని ఖాజా హుసైన్ గ్రహించారు. రాత్రి కొత్త చోటు నిద్ర పట్టడంలేదు. యాంత్రికంగా జిఐఒ అమ్మాయిలు ఇచ్చిన పుస్తకాలు అందుకున్నారు. దేవుని ఏకత్వం, ప్రవక్త ముహమ్మద్(స) జీవితం తెలిపే చిరు పుస్తకాలు చదువుతూ కునుకు తీసారు. తెల్లవారుజామున ఫజ్ర్ నమాజ్ కోసం దూరంగా మస్జిద్ నుండి మౌజన్ పిలుపు శ్రావ్యంగా వినిపిస్తూనే లేచి కూర్చున్నారు ఖాజాహుసైన్. మాటిమాటికి ఆ పుస్తకాల్లోని నిజధర్మం, ప్రక్క రహిమాన్ గారి ఆచరణలు అడుగుజాడలుగా మలుచుకుంటూ విత్ బెస్ట్ కాంప్లిమెంట్స్ అన్న జిఐఓ పిల్లలకు మనసులోనే ధన్యవాదాలు తెలుపుకున్నారు ఖాజా హుసైన్. ఉదయం డా.లతీఫ్ తనను, రహిమాన్ గారిని కూడా డిస్చార్జ్ చేసారు. ఒక్కరోజులోని ఆసుపత్రి అనుభవం నెమరేసుకుంటూ రెస్టులో ఉన్న పదిహేను రోజుల్లో ఇంట్లో పలుమార్లు ఆ పుస్తకాలు చదివారు. కోలుకున్నాక మొదట ఖాజా హుసైన్ వేసిన అడుగులు మస్జిద్ వైపు క్షణం..క్షణం మధురంగా ఆయన హృదయంలో నిలిచి పోయాయి. ❖



# అన్నదానం అల్లాహ్‌కు ఎంతో ఇష్టం

**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**(29-8-2025 సంచిక తరువాయి భాగం)**

### అన్నదాతలే ఉత్తమ విశ్వాసులు

హమ్జా బిన్ సుహైబ్ తన తండ్రి నుండి ఉల్లేఖించినది: ఒకసారి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) సుహైబ్ (రజి)తో అన్నారు: "ఓ సుహైబ్! నీవు గొప్ప వ్యక్తివి, కానీ నీలో మూడు లక్షణాలు లేకపోతే నీవు ఇంకా శ్రేష్ఠుడవయ్యేవాడివి!" అది విని సుహైబ్ (ర),

"అవి ఏమిటో చెప్పండి!" అన్నారు. ఉమర్ (రజి) అన్నారు 1) నీవు సంతానం లేనివాడివై 'అబూ యహ్యా' అని కునియతు పెట్టుకున్నావు. 2) నీవు అరబ్బు వంశస్థుడివి కాదు, అయినా అరబ్బులలో నిన్ను చేరుస్తున్నావు, ఎందుకంటే నీవు రోమీయుడివి. 3) నీలో అన్నదాన విషయమై చాలా అతి ఉంది.

దీనికి సుహైబ్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "నన్ను అబూ యహ్యా అని పిలిచింది స్వయంగా అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). నేను నిమ్ర్ బిన్ ఖాసిత్ అనే అరబ్ తెగకి చెందినవాడిని. రోమీయులు నన్ను మోసిల్ ప్రాంతంలో నుండి చిన్నపిల్లాడిగా ఉండగానే బందీ చేసుకున్నారు. నాకు అప్పటికే నా వంశపారంపర్యం తెలిసి ఉండేది. ఇక తిండి - అన్నదానం విషయంలో నాలో అతి ఉందన్న విషయంలో మీరు చెప్పిన దానిపై నా వివరణ: ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిని ఇలా చెబుతుండగా స్వయంగా నేను విన్నాను: "మీరిలో ఉత్తములు- అన్నదానం చేసేవారు!" (ముస్నద్ అహ్మద్)

ఈ హదీసు ద్వారా మనం నేర్చుకోవలసింది: మితంగా ఖర్చు చేయాలి, కాని అవసరమైన చోట ఉదారంగా ఇవ్వడంలో వెనుకాడకూడదు.

### మన అంతస్థును పెంచే ఘనకార్యం అన్నదానం

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: ప్రమాదకరమైన మూడు పనులు, రక్షించు మూడు కర్మలు, పాపాలకు ప్రాయశ్చిత్తంగా మారే మూడు పనులు, మనకు అల్లాహ్ దగ్గర ఉన్నత స్థానాలు అందించే మూడు ఘన కార్యాలు.

**మూడు వినాశకరమైనవి (ముహ్లికాత్):** 1) లోభం: దురాశ లేదా పిసినారితనం. (అది మన హృదయాన్ని కట్టిపడేస్తుంది, దానిని

అణచకుండా అనుసరించడం) 2) మోహం: తన కోరికలను అనుసరించడం. దారి తప్పిన కోరికల, మనోవాంఛల మత్తులో మునిగిపోవడం. 3) మదం, మత్సర్యం తనని తాను గొప్పవాడిగా భావించడం: గర్వభావన, అహంకారం, స్వీయ ప్రశంస. (ఇవన్నీ మన ఆత్మను పాడుచేసే, వినాశనానికి దారి తీసే స్వభావాలు)

**మూడు రక్షించే విషయాలు (ముంజియాత్):** 1) కోపంలోనూ, సంతోషంలోనూ న్యాయంగా వ్యవహరించడం. (స్థితి ఏదైనా సరే, తారతమ్యం లేకుండా హక్కును న్యాయంగా ఇవ్వడం) 2) పేదరికంలోనూ, ఆస్తి ఐశ్వర్యంలోనూ మధ్యేమార్గం అనుసరించటం (ఖర్చులో న్యాయం, ఈర్ష్య లేకుండా సంతృప్తిగా జీవించటం) 3) పది మందిలో ఉన్నా, ఏకాంతంలో ఉన్నా అల్లాహ్‌కు భయపడడం. (ఇవి మనకు రక్షణ కవచంగా మారే గుణాలు)

**మూడు కఫ్ఫారాలు (ప్రాయశ్చిత్తాలు)** : 1) ఒక నమాజ్ తరువాత, మరొక నమాజ్‌కై ఎదురు చూస్తూ ఉండటం. (ఇది ఆత్మను శుద్ధి చేస్తుంది). 2) చలికాలంలో కూడా చక్కగా పూర్తి వుజూ చేయడం. (కష్టమయిన సమయంలోను అల్లాహ్ హుక్కును నెరవేర్చడం). 3) జమాఅత్ (సామూహిక) నమాజుకు నడిచి వెళ్లడం. (ఇవి మన పాపాలను ప్రక్షాళనం గావించే సత్కర్మలు).

**అంతస్తులను పెంచే మూడు కర్మలు** : 1) అన్నదానం చేస్తూ ఉండటం. 2) శాంతి (సలాం)ని వ్యాప్తి చేయడం. 3) ప్రజలు నిద్రలో ఉండగా రాత్రిపూట నమాజ్ చేయడం. (ఇవి ఇహపరాల్లో మన అంతస్తులను పెంచే అమూల్య సాధనాలు). (సహీహుల్ జామే)

## ఇస్లాంలో శ్రేష్ఠమైన ఆచరణ అన్నదానం

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)ను, "ఇస్లాంలో అన్నిటికన్నా శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని అడిగాడు. దానికి ఆయన "ప్రజలకు అన్నం తిని పించు, పరిచయమున్నా లేకపోయినా, ప్రతి వ్యక్తికీ సలాం చెయ్యి. (ఇవే ఇస్లాంలో అన్నిటికన్నా శ్రేష్ఠమైన ఆచరణలు)" అని చెప్పారు. (బుఖారీ - ముస్లిం)

బీదసాదలకు అన్నదానం చేయటం, అతిథికి, అభాగ్యులకు భోజన సదుపాయాలు సమకూర్చటం మొదలగునవన్నీ ప్రజలకు అన్నం తినిపించటం క్రిందికే వస్తాయి. అలాగే అవసరాల్లో ఉన్న వ్యక్తి అవసరం తీర్చడం, ఆకలిగొన్న వాడికి అన్నంపెట్టడం, బట్టలు లేనివారికి బట్టలు తొడిగించటం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్సనందించటం, రుణగ్రస్తుని రుణభారాన్ని తగ్గించటం మొదలైన ప్రజోపయోగ కార్యకలాపాలన్నీ ఈ హదీసు భావపరిధిలోకి వస్తాయి.

## పాప ప్రక్షాళనా సాధనం అన్నదానం

దైవప్రవక్త (సల్లం) తెలియజేసిన వృత్తాంతాన్ని హజ్రత్ అబూ హురైరా (రజి) గారే ఈ విధంగా ఉటంకించారు: ఒకానొక సమయంలో ఒక వ్యక్తి ఓ దారి గుండా పడచివెళుతుండగా అతనికి విపరీతంగా దాహం వేసింది. ఒకచోట బావి కనబడితే అందులోకి దిగి నీళ్ళు త్రాగి తిరిగి బయటికొచ్చాడు. అంతలోనే అక్కడ అతనికి ఒక కుక్క కనిపించింది. దప్పికతో నాలుక వెళ్ళబెట్టి (రొప్పుతూ) బురదమట్టిని నాకసాగింది. అది చూసి ఆ మనిషి "నేను దప్పికతో అల్లాడి పోయినట్లే ఈ కుక్క కూడా బాధ పడు తుందేమో!" అనుకొని మళ్ళీ బావిలోకి దిగాడు. తన కాలి జోడును నీటితో నింపి, దాన్ని నోటితో పట్టుకొని పైకి తెచ్చాడు. ఆ నీరు కుక్కకు త్రాపించాడు. అప్పుడు అల్లాహ్ అతను చేసిన పనిని మెచ్చుకొని అతన్ని క్షమించాడు. ఈ వృత్తాంతం విని అనుచరులు "దైవప్రవక్తా! భూత దయపై కూడా మాకు పుణ్యం లభిస్తుందా!" అని సందేహపడగా "అవును. తడి కాలేయం (ప్రాణం) గల ఏ జీవికి సహాయం చేసినా మీకు పుణ్యం లభి స్తుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). (బుఖారీ ముస్లిం)

## స్వర్గ ప్రవేశానికి మార్గం అన్నదానం

మదీనాకు హిజ్రత్ చేసి వెళ్లిన తర్వాత తొలుత- దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధిస్తుండగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) తెలియజేశారు : "ప్రజలారా! సలాంను సర్వ సామాన్యం చెయ్యండి. (ఆకలిగొన్న వారికి) అన్నం పెట్టండి. బంధువుల యెడల ఉత్తమంగా మెలగండి, జనులు ఆదమరిచి నిద్రపోయి ఉన్నప్పుడు (తహజ్జుద్) నమాజ్ చేయండి. వీటిని పాటిస్తే మీరు ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశిస్తారు". (తిర్మిజీ-హసన్, సహీహ్)

## స్వర్గవాసుల సుగుణం అన్నదానం

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకసారి సహాబాను ఇలా అడిగారు: "ఈ రోజు మీలో ఎవరు ఉపవాసంతో ఉన్నారు?"- అందుకు అబూ బకర్ (రజియల్లాహు అన్హు) చెప్పారు: "నేను.". "ఈ రోజు మీలో ఎవరు చనిపోయినవారి అంత్యక్రియలకు వెళ్ళారు?"- అబూ బకర్ (ర.అ.) చెప్పారు: "నేను.". "ఈ రోజు మీలో ఎవరు పేదవారికి అన్నదానం చేశారు?" అబూబకర్ (ర.అ.) మళ్లీ సమాధానమిచ్చారు: "నేను." "ఈ రోజు మీలో ఎవరు ఓ రోగిని పరామర్శించారు?" అబూ బకర్ (ర.అ.)

మళ్లీ చెప్పారు: “నేను.” - అప్పుడు అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: “ఈ నాలుగు సలక్షణాలు ఒకే వ్యక్తిలో ఒకే రోజున ఉంటే అతను ఖచ్చితంగా స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.” (ముస్లిం)

## ఆకలితో వున్న వాని మాటలకు ఆగ్రహించవద్దు !

అమ్మకి నేను అన్నం పెడుతున్నాను అనటం మూర్ఖత్వం! అమ్మ చేతి అన్నం తింటున్నాను అని చెప్పగలిగినవాడు ధన్యుడు! ఆత్మీయులతో కలసి తినే భోజనానికి రుచి ఎక్కువ! చారు కూడా అమృతంలా రుచిస్తుంది! మీ పిల్లలు ఎంతదూరంలో, ఎక్కడ వున్నా, వేళకు ఇంత అన్నం తినగలుగుతున్నారంటే అది వాళ్ళ గొప్పా కాదూ, మీ గొప్పా కాదు అది. కేవలం, కేవలం మీపై ఉన్న అల్లాహ్ కృప మాత్రమే! నేటికీ కూడా ఎంతో మంది హోటళ్ల బయట మనకు తారసపడతారు. ఉన్నోళ్లు తిని విసిరేసిన విస్తరాకుల్లోని అన్నం మెతుకుల్ని ఏరుకునేవారు, ఆ క్రమంలో కుక్కలతో సయితం పోరాడటానికి వెనుకాడని వారు ఎందరో!

నేటి మన విందులు ఆర్భాటాలు ఎలా ఉన్నాయో ఒకసారి నెమరు వేసుకొండి. పేదవారిని విస్మరించి ధనవంతుల్ని మాత్రమే ఆహ్వానించటం నైతికంగా ఎంతో దిగజారిన పని అనిపించుకుంటుంది. దీనివల్ల కలిగే ఇంకో దుష్పరిణామం ఏమిటంటే, ధనవంతులు చేసే ఘనమైన విందు ఏర్పాట్లని చూసి పేదవారు చిన్నబుచ్చుకుంటారు. తమ దగ్గర అంత స్థోమత లేకపోయినందుకు వారి మనసు చివుక్కుమంటుంది. ఈ విధంగా ఒక ముస్లింని మానసికంగా కష్టపెట్టడం కూడా పాపమే. ఇస్లాం ధర్మం అగత్యపరుల్ని ఆదుకోవాలని, వారి మనసును సంతుష్టపరచాలని, సమాజంలోని నిరుపేదల పట్ల ఉత్తమంగా వ్యవహరించాలని ఆదేశిస్తోంది. ముస్లింలు వలీమా విందుల్లోగాని, మరే ఇతర విందుల్లోగాని రకరకాల వంటకాలు, ఘనమైన ఏర్పాట్లకు బదులు ఒకటి రెండు రకాల వంటకాలతో సరిపెట్టుకొని బంధు మిత్రులతో పాటు నిరుపేదలు, అభాగ్యుల్ని కూడా ఆహ్వానిస్తే పైన చెప్పబడిన మూడు రుగ్మతలూ ఉండవు. తద్వారా సమాజంలో అనతి కాలంలోనే మంచిమార్పులు కనిపిస్తాయి. పరలోకంలో కూడా దైవశిక్ష తప్పుతుంది.

ప్రతి శుక్రవారం మనుషులమైన మనం స్నానాలు ఆచరించి, కొత్త బట్టలు ధరించి, అత్తరు పూసుకొని బారులు కట్టి మరి మస్జిద్‌కి పోతాము అల్లాహ్ ప్రీతి కోసం. మనం వెళ్లే ఆయా ప్రార్థనాలయాల ముందు మండుటెండల్లో కూర్చుని మాడిపోతూ, వానకు తడిసి ముద్దవుతూ కొందరు ఎదురు చూస్తుంటారు మనసున్న మనషులు కోసం... కులము మతము వర్గము వర్ణము లేనిదొకటే! అదే ఆకలి బాధ! హద్దులు, సరిహద్దు రేఖలు లేని ఏకైక వ్యథ క్షుద్బాధ!

స్థితిమంతులు తమల్ని తాము గొప్పవారిగానూ, తమకన్నా తక్కువ స్థాయిలో వున్నవారిని అల్పులుగానూ భావించకూడదు. పైగా బలహీనుల్ని, నిస్సహాయుల్ని గౌరవించాలి. వారు కష్టాల్లో ఉంటే ఆదుకోవాలి. బహుశా మీపై ఆధారపడి బతుకుతున్న వారిమీద కనికరంతోనే దేవుడు మీ సిరిసంపదల్లో వృద్ధిని ప్రసాదిస్తున్నాడేమో! అలాంటప్పుడు మీరు మిడిసిపడటం దేనికి?!

ప్రాణం నిలిపే అన్నం గొప్పదా జీవితాన్ని నిలిపే చదువు గొప్పదా అనీ అడిగితే.. దేనికదే గొప్పది. ఒక్క కన్నుతో చూస్తే చూసే పరిధి ఎలా తగ్గిపోతుందో ఒక్క అన్నదానం విద్యా దానంలో ఒకటే గొప్ప అనుకుంటే మన ఆలోచనా పరిధి అక్కడితోనే ఆగిపోయిందని అనుకోవాలి. జీవితాంతం అన్నం పెట్టేది చదువు. కడుపుకు అన్నం పెట్టినట్టు బుర్రకు చదువు అనే అన్నం పెడితే జీవితాంతం ఒకరి ముందు దేహి అని చేయి చాచాల్సిన అవసరం రాదు!!

## పశుపక్షాదులకు సయితం అన్నదానం చేయాలి

హజ్రత్ జాబిర్ (రజి) చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: ఎవడైనా ముస్లిం ఒక చెట్టు నాటితే (దాని ఫలాలు పక్షులు, పందికొక్కులు, తదితర జంతువులు, కీటకాల వల్ల) తినేయబడినా అది అతని తరపునుండి ‘సదఖా’ (పుణ్య కార్యం) అవుతుంది. అలాగే అందులోనుంచి దొంగిలించబడినా దాన్ని అతని తరపు నుండి ‘సదఖా’గానే భావించడం జరుగుతుంది. ఎవడైనా దానికి నష్టం కలిగిస్తే, అది కూడా సదఖాగానే పరిగణించ బడుతుంది. (ముస్లిం)

## చివరి మాట

మనం కూడా మనకి తోచినంత సాటి మనిషికి సాయపడుదాం. మనం సంపాదించుకున్న ఆస్తి వయసు మీరితే పేరు మార్చుకుంటది. మనం చేసిన మంచే ఎప్పటికీ మన పేరు మీదుంటది. అల్లాహ్ కూడా జెప్తున్నాడు, చేసిన సాయం తప్ప ఇంకేది మనతో రాదని.

మీరు మీకోసం ఏ పుణ్యకార్యం చేసి పంపుకుంటారో అది అల్లాహ్ వద్ద సురక్షితంగా ఉంటుంది. అదే అత్యంత శ్రేష్ఠమైనది, దాని సుకృతఫలం కూడా ఘనమైనది. అల్లాహ్‌ను మన్నింపు వేడుకొండి. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (అల్-ముజమ్మిల్: 20)

మనలో మంచి ధర్మపరాయణులయినవారు ఎందరో - ప్రతి

సోమా, గురు వారాలు, అయ్యాము బీజ్ - ప్రతి చంద్రమానపు 13,14,15 తేదీల్లో అంటే చంద్రుడు పూర్ణ స్థితిలో ఉన్నప్పుడు సహరీ తర్వాత ఏమి తినకుండా ఉపవాసం ఉంటూనే, మామూలు రోజు కంటే మరింత ఉత్సాహంగా పనిలో లీనమవుతారు. అలా చేయడం ద్వారా ఇంకా ఆకలి బాగా వేస్తుంది. ఉపవాసం విరమించాక ఇంకా ఇంకా బాగా తింటాము కూడా. కానీ ఉపవాసమున్న, ఉపవాసం లేకున్నా నిత్యం పస్తులతో బతుకు బండిని చాల బరువుగా ఈడుస్తూ బతికే బడుగు బలహీన ప్రజలు ఏం తింటారు? ఏం తిని బతుకుతారు? చెప్పండి! మన ఉపవాసం విరమణతో పూర్తయితే వారి ఉపవాసనాలు విరమణ లేకుండానే కొనసాగుతుండాయో!

బతుకంటే మన ఫోటో చూసుకొని మనం మురిసిపోవడం కాదు. మన పేరు విన్న మన ఫోటో చూసిన ఎదుటివాళ్ళ పెదాల్లో ఒక చిరునవ్వు రావాలి. అది రావాలంటే, మనలోని మలినాలన్నీ తొలగించుకొని స్వచ్ఛంగా బతకాలి. అప్పుడే మనకు సుఖం, మన వల్ల నలుగురికి ఉపయోగం! ఆకలి మూడు అక్షరాలు - కన్నీళ్లు మూడు అక్షరాలు - ఆ ఆకలి తీర్చి, ఆ కన్నీళ్లు తుడిచిన తర్వాత కలిగే ఆనందం సయితం మూడు అక్షరాలే. ఆ ఆనందాన్ని మనందరి మనస్సులో నింపగలిగే సత్తా శక్తి గల ఆ అల్లాహ్ పవిత్ర పేరు కూడా మూడు అక్షరాలే!

# సమయ పాలన అలవాటు చేసుకోండి!




చాలా సందర్భాలలో అది బస్సు కోసమైనా, ఉద్యోగానికైనా, ఏ పనికైనా నిరీక్షణ తప్పదు. సమావేశాల్లో ఆలస్యంగా వచ్చే తోటి ఉద్యోగుల కోసం ఎదురు చూడాలి. చెప్పిన టైమ్‌కి రాని వారి కోసం, ఇవాళ అయిపోతుందనుకున్న పని ఎదుటి వ్యక్తి ముగించకపోతే దాని కోసమూ నిరీక్షించాలి.

◆ కొత్త నిర్ణయాలు, సమాచారాలు, అనుమతులు మొదలైన వాటి కోసం ఎప్పుడో ఒకప్పుడు ఎదురు చూస్తూ ఉండటం తప్పదు. ఈ అనంతమైన నిరీక్షణ వలన సమయం వృధా అవుతుంది. ఫలితాలు ఆలస్యమవుతాయి. సంబంధాలు చెడిపోవచ్చు.

◆ కొన్నిసార్లు నిరీక్షణ తప్పదు. దాన్ని అంగీకరించి వదిలి వేయడమే మంచిది. కొన్ని సందర్భాలలో ఎదుటి వ్యక్తి వల్ల లేదా మన వల్ల కూడా సమయం వృధా అయి మనం బలవుతాం. సమయం పాటించే అలవాటును పెంచుకునేందుకు కొన్ని పద్ధతులున్నాయి. అవి–

1) ఒక పని పూర్తి చేయటానికి ఎంత సమయం పడుతుంది? అని సరిగ్గా అంచనా వేయడం వల్ల సమయం ఆదా అవుతుంది.

2) పనిని అనుకున్న టైమ్‌కే ప్రారంభించాలి. గడువు లోపు దానిని పూర్తి చేసేయాలి, అంతే.

3) వాచీ (చాలామంది వాడటంలేదు) లేదా సెల్‌ఫోన్‌లో టైమ్‌ను కొన్ని నిమిషాలు ముందుకు పెట్టుకోండి. అనుకున్న చోటుకి ముందుగానే చేరుకుంటారు.

4) ఎక్కడికైనా చేరుకోవటానికి (అరగంట) ముందుగానే బయలుదేరండి. ఆలస్యంగా చేరుకోరు.

5) ఈ పనిని చేసేసి బయలుదేరుదాం అని కాకుండా టైమవ్వగానే బయలుదేరండి. లేదంటే తప్పకుండా మీకు ఆలస్యం అవుతుంది.

6) అనుకోని సంఘటనలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని మరచిపోవద్దు. ఎన్నో పొరపాట్లు, ప్రమాదాలు (మనం కంగారులో ఉంటే) జరిగే అవకాశాలు ఎక్కువ అవుతాయి. కనుక ఇలాంటి అవాంతరాల కోసం మీ కాలపట్టికలో కొంత సమయాన్ని కేటాయించుకోండి.

మీ పాత అలవాట్లను నెమ్మదిగా ఒక్కొక్కటి చొప్పున మానుకుని ఖచ్చితంగా సమయ పాలన అలవాటును పెంపొందించుకోండి. ఫలితాలు మీకు ఆశ్చర్యం కలిగిస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాదంటారా?!

నసీమ్ సుల్తానా



# మీ పిల్లల ముందు ఈ మాటలు అస్సలు అనకండి

**పిల్లలను పెంచడం** అనేది సవాళ్ళతో కూడిన ప్రయాణం. కొన్నిసార్లు, ఒత్తిడి ఉన్న క్షణాల్లో తల్లిదండ్రుల నోటి నుండి పశ్చాత్తాపపడేలా చేసే మాటలు వస్తాయి. ఈ వాక్యాలు పైకి చిన్నవిగా లేదా హానికరం కానివిగా అనిపించవచ్చు, కానీ మానసిక నిపుణులు (సైకాలజిస్ట్)ల ప్రకారం, పిల్లల ఆత్మ విశ్వాసం, భావోద్వేగ ఎదుగుదలపై వీటి ప్రభావం చాలా లోతుగా ఉంటుంది. తల్లిదండ్రులు తరచుగా చెప్పే ఏడు సాధారణ మాటలను, వాటి వల్ల పిల్లలపై పడే ప్రభావాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం:

### 1. తోబుట్టువుల మధ్య పోలికలు తేవడం

ఉదాహరణ: "నువ్వు నీ అన్నయ్యలా ఎందుకు ఉండలేవు?" ఇలాంటి పోలికలు తోబుట్టువుల మధ్య శత్రుత్వం, అసూయ, అనవసరమైన పోటీ, కొన్నిసార్లు ద్వేషాన్ని కూడా పెంచుతాయి. దీనివల్ల పిల్లలు తమకంటూ ఒక గుర్తింపు లేదని, తల్లిదండ్రుల దృష్టిలో తాము తక్కువ అని భావించవచ్చు, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

### 2. ఖచ్చితమైన (Absolute) వాక్యాలను ఉపయోగించడం

ఉదాహరణ: "నువ్వు ఎప్పుడూ నా మాటలు మర్చిపోతావు!" ఇలాంటి వాక్యాలు పిల్లలు ఎప్పటికీ మారలేరని, మెరుగుపడలేరని భావించేలా చేస్తాయి, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని, నేర్చుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. తల్లిదండ్రులు ఈ మాటలు ఇలా చెప్తే మంచిది: "నువ్వు కొన్నిసార్లు విషయాలను మర్చిపోతున్నావని నాకు అనిపిస్తుంది, పర్లేదు, దానిపై కొంచెం శ్రద్ధ పెట్టు."

### 3. ప్రోత్సాహం లేకుండా నిరాశను వ్యక్తపరచడం

ఉదాహరణ: "నువ్వు ఇంకా బాగా చేస్తావని మేము ఆశించాం." తల్లిదండ్రులు తమ పిల్లల నుండి ఆశలు

పెట్టుకోవడం సహజం, కానీ మార్గదర్శకత్వం లేదా సహాయం లేకుండా నిరాశను వ్యక్తం చేస్తే పిల్లలు తమను తాము విఫలమైన వారుగా భావించుకోవచ్చు. దీనివల్ల వారిలో ఒత్తిడి, వైఫల్యం భయం పెరగవచ్చు. తల్లిదండ్రులు ప్రోత్సాహకర మైన మాటలను ఎంచుకోవడం మంచిది: "నువ్వు కష్టపడు తున్నావని నాకు తెలుసు, దీన్ని మనం ఎలా మెరుగు పరచవచ్చో చూద్దాం."

## 4. పిల్లల భావాలను నిర్లక్ష్యం చేయడం లేదా వాటి ప్రాముఖ్యతను తగ్గించడం

ఉదాహరణ: "నువ్వు అతిగా స్పందిస్తున్నావు." పిల్లల భావా లను నిర్లక్ష్యం చేయడం లేదా వాటిని అనవసరమైనవిగా భావించడం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఇలా పదే పదే జరిగితే పిల్లలు తమ భావాలను అణచివేసుకోవడం ప్రారంభిస్తారు, మానసికంగా కూడా బలహీనపడవచ్చు. తల్లిదండ్రులు వారి భావాలను గుర్తించడం మంచిది, ఉదాహరణకు: "ఈ విషయం నీకు బాధ కలిగించిందని నాకు తెలియదు, నేను ఇకపై జాగ్రత్తగా ఉంటాను."

## 5. పిల్లలపై ప్రతికూల ముద్ర వేయడం

ఉదాహరణ: "నువ్వు చాలా బద్ధకస్తుడివి." ప్రతికూలమైన ముద్రలు పిల్లల మనసులో తమ వ్యక్తిత్వం గురించి చెడు ఆలోచనలను సృష్టిస్తాయి. ఒక పిల్లవాడిని పదేపదే 'బద్ధకస్తుడు', 'మర్యాదలేనివాడు' లేదా 'పనికిరానివాడు' అని పిలిస్తే, వారు నిజంగా తమ గురించి అలాగే ఆలోచించడం మొదలు పెడతారు, ఇది వారి అభివృద్ధికి ఆటంకం కలిగించ వచ్చు. తల్లిదండ్రులు వ్యక్తిత్వం గురించి కాకుండా సమస్య గురించి మాట్లాడడం మంచిది, ఉదాహరణకు: "నువ్వు ఇంకొంచెం కష్టపడాలని నాకు అనిపిస్తుంది, నేను నీకు సహాయం చేస్తాను."

## 6. వేరే పిల్లలతో పోల్చడం

ఉదాహరణ: "నీ స్నేహితుడు ఎంత బాగా చేస్తున్నాడో చూడు, నువ్వు ఎందుకు అలా చేయలేవు?" ఇలాంటి పోలికలు పిల్లల్లో inferiority complex (ఆత్మన్యూనతా భావం)ను సృష్టిస్తాయి, వారు తాము ఎప్పటికీ 'చాలా బాగా' లేమని భావించేలా చేస్తాయి. దీనివల్ల పిల్లల్లో అనవసరమైన పోటీ, అభద్రత భావం పెరగవచ్చు. తల్లిదండ్రులు పిల్లల స్వంత సామర్థ్యాలపై దృష్టి పెట్టి ఇలా చెప్పడం మంచిది: "నువ్వు కష్టపడుతున్నావని నాకు తెలుసు, ఎక్కడ మరింతగా మెరుగుపడాలో కలిసి చూద్దాం."

## 7. కోపంలో బాధ కలిగించే మాటలు చెప్పడం

ఉదాహరణ: "నువ్వు పుట్టకపోయి ఉంటే బాగుండేది!" కోపంలో, చిరాకులో చెప్పే కఠినమైన, చేదు మాటలు పిల్లల వ్యక్తిత్వంపై లోతైన, చెరగని ప్రతికూల మానసిక ప్రభావా లను చూపుతాయి. ఇలాంటి వాక్యాలు పిల్లల్లో తాము ఇష్టం లేనివారమని, తల్లిదండ్రులు తమను ప్రేమించరని, లేదా తాము ఇంట్లో ఒక అనవసరమైన అదనపు వ్యక్తిత్వమని భావించేలా చేస్తాయి. తల్లిదండ్రులకు కోపం వచ్చినప్పుడు, మౌనంగా ఉండడం మంచిది, తర్వాత నెమ్మదిగా సమస్య గురించి మాట్లాడాలి. పొరపాటున ఏదైనా బాధ కలిగించే మాట అని ఉంటే, పిల్లలకు క్షమాపణ చెప్పడం కూడా అవసరం, ఉదాహరణకు: "నేను అలా అన్నందుకు క్షమించు, నేను కోపంలో ఉన్నాను, కానీ దాని అర్థం నేను నిన్ను ప్రేమించడం లేదని కాదు."

## తల్లిదండ్రుల మాటల శక్తి

తల్లిదండ్రులుగా ఉండడం ఒక పెద్ద బాధ్యత. నిరాశ లేదా కోపావేశాలు ప్రతి ఇంట్లో ఉంటాయి, కానీ మన మాటలు పిల్లల మానసిక, భావోద్వేగ ఆరోగ్యంపై చాలా లోతైన ప్రభావాన్ని చూపుతాయి. మనం మన సంభాషణలో సున్నితత్వం, సహనం, ప్రేమను చేర్చగలిగితే, మనం మన పిల్లల ఆత్మవిశ్వాసాన్ని పెంచగలుగుతాం, వారిని ఒక బలమైన, స్థిరమైన, గౌరవప్రదమైన వ్యక్తిత్వాలుగా తీర్చిదిద్ద గలుగుతాం. తల్లిదండ్రులు కూడా సంపూర్ణులు (Perfect) కారు, కానీ తమ మాటలు, ప్రవర్తనలో స్పృహతో కూడిన మెరుగుదల తెచ్చుకోవడం ద్వారా తమ పిల్లల కోసం ఒక సురక్షితమైన, ప్రేమతో కూడిన, సమతుల్యమైన, సంతోష కరమైన వాతావరణాన్ని ఖచ్చితంగా సృష్టించగలరు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
గీటురాయి
వారపత్రిక




**మనిషి** జీవితం ఆటుపోట్లకు, ఒడిదుడుకులకు గురవుతూ ఉంటుంది. అటువంటప్పుడు మనసు తీవ్రంగా ప్రభావితం అవుతుంది. అశాంతి అలజడులకు గురవుతుంది. అలాంటి సమయాలలో మనసును తేలికపరిచే కొన్ని వచనాల కోసం మనిషి తాపత్రయపడుతూ ఉంటాడు. ఇతరుల జీవితాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలనుకుంటూ ఉంటాడు. తన జీవిత గమనంలో దిశా నిర్దేశనం చేసేవారి కోసం వెతుకుతూ ఉంటాడు. ఇలాంటి పరిస్థితి దాదాపుగా ప్రతి మనిషికి ఎదురవుతూ ఉంటుంది. దైవప్రవక్త(స) కాలంలో ఆయన సహచరులకు ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు వారు ప్రత్యక్షంగా ఆయన గారి సమక్షంలో హాజరై పోయేవారు. కొన్నిసార్లు తన బాధను వెల్లడించి మార్గదర్శకత్వాన్ని పొందేవారు. మరికొన్ని సార్లు ఆయన(స) సభలో కూర్చుని, ఆయన(స) పవిత్ర ముఖాన్ని చూసి ఆయన (స) నోటి ద్వారా వెలువడే పవిత్ర వచనాలను తనివితీరా విని ప్రశాంతతను పొందేవారు. ఆ మహాభాగ్యం వారికి లభించింది. ఈనాటి మనిషి కూడా అలాంటి ప్రయోజనం పొందాలనుకుంటే దైవప్రవక్త(స) జీవిత చరిత్రను చదువుతూ ఉండాలి. అప్పుడు మనిషి మనసులో అలజడి రేపే ప్రతి ప్రశ్నకు అందులో సమాధానం లభిస్తుంది. కనుక ఈనాడు ఇక్కడ మనం అలాంటి కొన్ని సంఘటనలపై దృష్టిని సారిద్దాం.

దైవప్రవక్త(స) అనుచరుడైన హజ్రత్ జాబిర్ బిన్ సలీమ్(ర) మొట్టమొదటిసారి ఆయన(స) వద్దకు విచ్చేసిన సంఘటనను ఇలా తెలియజేశారు. నేను ఒకసారి ఒకచోట ఒక దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఒక చోట ప్రజలు సమావేశమై ఉన్నారు. వారి మధ్యలో ఒక గొప్ప వ్యక్తి కూర్చొని ఉన్నారు. ఆయన చెప్పిన మాటలను వారు చక్కగా వింటున్నారు. ఆచరిస్తున్నారు. ఇది చూసి అక్కడున్నవారితో నేను; ఎవరు ఈ వ్యక్తి? అని అడిగాను. వారు ఈయన దైవప్రవక్త(స) అని సమాధానమిచ్చారు. ఇది విన్న నేను ఓ దైవప్రవక్తా(స)! అలైకస్సలామ్ అని రెండుసార్లు పలికాను. కాని ఆయన(స) దానికి సమాధానం పలకలేదు, నిశ్శబ్దంగానే ఉండిపోయారు. తరువాత ఇలా సెలవిచ్చారు: అలైకస్సలామ్ అని పలకబాకు. అస్సలాము అలైకుమ్ అని సలామ్ చెయ్యి. ఆ తరువాత నేను, ఏమిటి మీరు అల్లాహ్ ప్రవక్తనా? అని అడిగాను. దానికి ఆయన(స), "అవును నేను ఆ అల్లాహ్ ప్రవక్తను, ఎవరినైతే మీరు ఆపదల్లో ఎలుగెత్తి పిలుస్తారో, కరువు కాటకాల్లో వర్షం కోసం ఎవరినైతే వేడుకుంటారో, ఎవడైతే మీ కోసం భూమి నుంచి పంటలు పండిస్తాడో, దారి తెలియని ఎడారి ప్రాంతంలో మీరు ప్రయాణిస్తున్న మీ ఒంటె తప్పిపోయినప్పుడు తిరిగి మీ వద్దకు ఎవడైతే చేర్చుతాడో ఆయన పంపిన ప్రవక్తను నేను" అని సెలవిచ్చారు.

అయితే 'ఓ దైవప్రవక్తా(స)! నాకు ఏదైనా హితబోధ చెయ్యండి' అని విన్నవించుకున్నాను. అప్పుడు ఆయన(స) "ఎప్పుడూ ఎవరినీ చెడ్డగా ఏమీ అనబాకు"అని సెలవిచ్చారు. ఆయన(స) బోధించిన ఈ విషయం నన్ను ఎంతగా ప్రభావితం చేసిందంటే, నేను జీవితాంతం ఎవరినీ చెడ్డగా ఏమీ అనలేదు. చివరకు బానిసను కూడా, జంతువులను కూడా. ఇంకా రెండో విషయం ఆయన

ఇలా బోధించారు : చిన్న సత్కార్యాన్ని చిన్నదిగా, అల్పమైనదిగా భావించకు. ఎడతెగకుండా ఆ చిన్న సత్కార్యాన్ని చేస్తూ ఉండు. (అబూదావూద్)

ఇంకా ఒకసారి కొంతమంది ఒక చోట సమావేశమై ఉన్నారు. అంతలో అక్కడికి దైవప్రవక్త(స) విచ్చేశారు. వారందరినీ ఉద్దేశించి మీలో అందరికంటే మంచి వ్యక్తి ఎవడో, మీలో అందరికంటే చెడ్డ వ్యక్తి ఎవడో తెలియజెయ్యనా? అని ప్రశ్నించారు. దానికి అందరూ మౌనంగా ఉండిపోయారు. ఆయన(స) ఇదే విధంగా మూడుసార్లు ప్రశ్నించారు. చివరకు ఒక అనుచరుడు 'ఓ దైవ ప్రవక్తా(స)! తెలియజెయ్యండి' అని విన్నవించుకున్నాడు. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు : ''మీలో అందరికంటే మంచి వ్యక్తి ఎవరంటే, ప్రజలు అతని నుండి మంచినే ఆశిస్తారు. అతని పట్ల ఎవరికీ ఎలాంటి భయమూ ఉండదు. మీలో అందరికంటే చెడ్డ వ్యక్తి ఎవడంటే, అతను మంచి చేస్తాడనే ఎలాంటి ఆశ ఎవరికీ కలగదు. ఇంకా అతను చేసే చెడు నుండి ఎవరూ తప్పించుకోలేరు''. (తిర్మిజీ)

అదేవిధంగా ఆయన(స) మరొకసారి ఇలా సెలవిచ్చారు; ''మీలో నుంచి ఎవరు నాతో ఐదు విషయాలు నేర్చుకోదలచుకుంటు న్నారు? దానిపై మీరు కూడా ఆచరించండి. ఇతరులు కూడా వారు ఆచరించే విధంగా వీటిని నేర్పండి''. దానికి సమాధానంగా హజ్రత్ అబూ హురైరా(రజి) ''ఓ దైవప్రవక్తా(స)! నేను నేర్చు కుంటాను' అని అన్నారు. అప్పుడు ఆయన(స) నా చెయ్యి పట్టుకుని ఐదు విషయాలను లెక్కిస్తూ ఇలా తెలియజేశారు :

1) పాపాల నుండి దూరంగా ఉండు. నీవు అందరికంటే ఎక్కువగా ఆరాధనలు చేసే దైవదాసుడైపోతావు.

2. అల్లాహ్ నీకు ఏవైతే ప్రసాదించాడో వాటితో తృప్తి పడు. అందరికంటే పెద్ద ధనవంతుడైపోతావు.

3. పొరుగువానితో ఉత్తమంగా వ్యవహరించు. విశ్వాసివై పోతావు.

4. కోసం ఏదైతే కోరుతావో ఇతరుల కోసం కూడా వాటినే కోరుకో; ముస్లిమువైపోతావు.

5. అతిగా నవ్వకు. ఎందుకంటే- అధికంగా నవ్వినట్లయితే నీ హృదయం మృతి చెందుతుంది. (తిర్మిజీ)

హజ్రత్ అబూ హురైరా(రజి) ఇలా తెలియజేశారు : ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త(స) గారి వద్దకు హాజరై ఇలా విన్నవించుకున్నాడు: 'ఓ దైవప్రవక్తా(స)! నా బంధువులు కొంతమంది ఉన్నారు. నేను వారితో కలుస్తాను. కాని వారు నాతో కలవరు. దూరంగా వెళ్ళిపోతారు. నేను వారితో మంచిగా వ్యవహరిస్తాను. కాని వారు నాతో చెడ్డగా వ్యవహరిస్తారు. అజ్ఞానంగా ప్రవర్తిస్తారు. నేను సహనం వహిస్తాను'. దైవప్రవక్త(స) అతను చెప్పే మాటన్నీ విని ఇలా సెలవిచ్చారు: ''నీవు చెప్పేదంతా నిజంగా అలాగే అయినట్లయితే నీవు వారి నోటిలో వేడివేడి బూడిదను నింపుతున్నట్లే. నీవు నీ ఈ వైఖరిపై స్థిరంగా ఉన్నట్లయితే అల్లాహ్ తరపు నుంచి నీకు సహాయం తప్పకుండా లభిస్తూ ఉంటుంది''. (ముస్లిమ్)

ఒకసారి దైవప్రవక్త(స) గారి ఒక అనుచరుడు హజ్రత్ ఆయిషా(ర) వద్దకు వచ్చి దైవప్రవక్త(స) గారి ఏదైనా ఒక ప్రత్యేక విషయాన్ని తెలియపరచండి అని అన్నారు. దానికి హజ్రత్ ఆయిషా ఏ విషయం తెలపను. ఆయన(స) గారి ప్రతి విషయమూ ప్రత్యేకమే. సరే, ఒకసారి ఏమైందంటే, ఆయన(స) నా ఇంట్లో ఉన్నారు, రాత్రి పడుకున్నారు. రాత్రి కొంత భాగం గడిచిన తరువాత అకస్మాత్తుగా లేచి బయటకు వెళ్ళారు. ఆయన(స) ఎందుకు వెళ్తున్నారో, ఎక్కడికి వెళ్తున్నారో నాకు అర్థం కాలేదు. నేను ఆయన(స) గారి వెనుకాలే బయటికి వచ్చాను. ఆయన(స) మస్జిద్‌లోకి ప్రవేశించారు. నేనూ లోపలికి ప్రవేశించాను. అక్కడి దృశ్యాన్ని చూసి అయ్యో నేనేదో ఊహించుకున్నాను. కాని దైవప్రవక్త(స) ఈ స్థితిలో ఉన్నారా! అనే మాట నా నోటి నుంచి అకస్మాత్తుగా వెలువడింది.

ఆ సమయంలో ఆయన(స) అల్లాహ్ ముందు విధేయత, వినమ్రతలతో చేతులు కట్టుకుని నిలుచుని ఉన్నారు. ఆయన(స) గారి కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళు ప్రవహిస్తూ ఉన్నాయి. వెక్కిళ్ళపై వెక్కిళ్ళు వస్తున్నాయి. కన్నీళ్ళతో గడ్డం పూర్తిగా తడిసిపోయి ఉంది. అదేవిధంగా రుకూ చేశారు, సజ్దా చేశారు. కాని కన్నీళ్ళు ప్రవహించటం ఆగలేదు. చివరకు నక్షత్రాలు అస్తమించాయి. ఫజ్ర్ నమాజ్ సమయం సమీపించింది. హజ్రత్ బిలాల్ (ర) వచ్చి అజాన్ ఇచ్చారు. అప్పుడు ఆయన(స) నమాజు ముగించుకుని ఇంట్లోకి ప్రవేశించారు. అప్పుడు నేను చూశాను. ఆయన(స) గారి రెండు పాదాలు ఉబ్బిపోయి ఉన్నాయి. బొటనవేళ్ళు చిట్లిపోయి ఉన్నాయి.

అది చూసి నేను 'ఓ దైవప్రవక్తా(స)! అల్లాహ్ మిమ్మల్ని సురక్షితంగా ఉంచుగాక! మీరు ఎందుకు ఈ విధంగా కష్టపెట్టు కుంటున్నారు. అల్లాహ్ అయితే మీ ముందు వెనుకటి పాపాల న్నింటినీ క్షమించివేశాడు కదా!' అని విన్నవించుకున్నాను.

దానికి ఆయన(స) : ''ఓ ఆయిషా! కారుణ్య ప్రభువు ఈ విధంగా నాపై కరుణ జూపినప్పుడు నేను కనీసం కృతజ్ఞతలైనా తెలుపు కోవద్దా?'' అని బదులిచ్చారు.




## 'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు

మారుమూల గ్రామాల్లో బాలికల విద్య కోసం విశేషంగా కృషి చేసిన భారతీయ స్వచ్ఛంద సంస్థను ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డు వరించింది. ఆసియాలో నోబెల్ బహుమతికి సమానమైనదిగా పరిగణించే రామన్ మెగసెసే అవార్డు-2025ను ప్రకటించారు. ఆసియా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో ప్రదర్శించే గొప్ప స్ఫూర్తికి గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరిస్తారు. ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయ సంస్థగా 'ది ఫౌండేషన్ టు ఎడ్యుకేట్ గర్ల్స్' చరిత్ర సృష్టించిందని రామన్ మెగసెసే అవార్డ్ ఫౌండేషన్ (ఆర్ఎంఏఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. "సఫీనా హుసైన్ స్థాపించిన ఎడ్యుకేట్ గర్ల్స్' సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడించింది. బాలికలు, యువతులను నిరక్షరాస్యత నుంచి విముక్తం చేసేందుకు, పూర్తి మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు వారిలో నైపుణ్యాలు, ధైర్యం పెంపొందించేందుకు ఈ సంస్థ నిబద్ధతతో పనిచేసింది" అని ప్రశంసించింది. సఫీనా హుసైన్ 2007లో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థను స్థాపించారు. తొలుత రాజస్థాన్‌లో ఈ సంస్థ తన కృషిని ప్రారంభించింది. 50 గ్రామాల్లో పైలట్ స్కూళ్లను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా 30వేల వరకూ అత్యంత మారుమూల గ్రామాలకు చేరుకొంది. సుమారు 20 లక్షల మంది బాలికలకు విద్యనందించింది.

## 14 ఏళ్ల తర్వాత ఆగస్టులోనే అత్యధిక వర్షపాతం..

ఈసారి మాన్సూన్ వాయవ్య భారతదేశంలో తీవ్రంగా ప్రభావం చూపించింది. భారత వాతావరణ శాఖ (IMD) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఈ ఆగస్టులో 14 ఏళ్లలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెలలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వర్షాలు కురిశాయి. ముఖ్యంగా వాయవ్య భారతదేశంలో 2001 తర్వాత ఇంత భారీ వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారి. భారత వాతావరణ శాఖ (IMD) చెప్పిన డేటా ప్రకారం, ఈ ఏడాది ఆగస్టులో 265 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 34.5% ఎక్కువ. అంటే, గత 14 ఏళ్లలో ఆగస్టు నెలలో ఇదే అత్యధిక వర్షపాతం (August 2025 heavy rains). 1901 నుంచి ఈ లెక్కలను చూస్తే, ఇది 13వ అత్యధిక వర్షపాతం కావడం విశేషం.

## రోడ్డు ప్రమాదాల్లో 8వ స్థానంలో తెలంగాణ

దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో, రోడ్డు ప్రమాద మరణాల్లో 10 వ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 22, 903 రోడ్డు ప్రమాదాలు జరగగా ఈ యాక్సిడెంట్లలో 7,660 మంది ప్రాణాలు కోల్పోయినట్టు కేంద్రం వెల్లడించింది. అయితే, ఘోరమైన యాక్సిడెంట్ల ర్యాంకింగ్స్ లో తెలంగాణ 22 వ స్థానంలో ఉన్నట్లు తెలిపింది. 2022తో పోల్చితే రాష్ట్రంలో సుమారు వెయ్యికి పైగా ప్రమాదాలు పెరిగినట్లు తెలిపింది. ఇదే సందర్భంలో దేశవ్యాప్త ప్రమాదాల్లో తెలంగాణ రాష్ట్ర భాగస్వామ్యం 4.8గా, మరణాల్లో 4.4 గా నమోదు చేసినట్లు పేర్కొంది. అయితే మానవ తప్పిదాలే దేశంలో ప్రతి యేటా రోడ్డు ప్రమాదాలు పెరగడానికి కారణమని వెల్లడించింది. ఇందులో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్లు, సీట్ బెల్టులు వంటి భద్రతా పరికరాలు వాడకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపింది. దేశంలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించి ఇటీవలే కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 'రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా- 2023' రిపోర్ట్‌ను విడుదల చేసింది.

## ముగ్గురు పిల్లలతో భారత మహిళపై భారం

కుటుంబంలో ముగ్గురు పిల్లల పేరుతో భారతీయ మహిళలపై భారం పెంచొద్దని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. ముగ్గురు పిల్లలుంటే ఆ కుటుంబంలోని పిల్లల మధ్య సాన్నిహిత్య సంబంధాలు ధృడమవుతాయన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యల్లో ద్వంద్వార్థాలున్నాయని శుక్రవారం దారుస్సలాంలో మీడియాతో అన్నారు. ముగ్గురు పిల్లలను కనాలని భారతీయ మహిళలపై భారం మోపాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారని మోహన్ భాగవత్‌ను ప్రశ్నించారు. ప్రధాని మోదీ హయాంలో దేశంలోని ముస్లింలపై శత్రుత్వం సుస్థిరమైందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్, దానికి మద్దతుగా నిలిచిన మితవాద సంస్థలు నిరంతరం మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని జనాభా పెరుగుదలపై తప్పుడు సమాచారంతో విమర్శలు చేస్తుంటాయని, కానీ వాస్తవ పరిస్థితులు దానికి భిన్నమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 80 శాతం కాగా, ముస్లింలు కేవలం 14.23 శాతమని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ప్రజల వ్యక్తిగత, కుటుంబ జీవితంపై మాట్లాడేందుకు మీరెవరని భాగవత్‌ను ప్రశ్నించారు.




## అమెరికాకు 25 దేశాల పోస్టల్ సర్వీసులు నిలిపివేత

ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికాపై ఆయా దేశాలు ఆచితూచి స్పందిస్తున్నాయి. ఈ క్రమంలో చిన్న ప్యాకేజీలపై పన్ను మినహాయింపులను ట్రంప్ యంత్రాంగం ఉపసంహరించుకున్న నేపథ్యంలో అమెరికాకు పోస్టల్ సర్వీసులు నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంటున్నాయి. ఇలా ఇప్పటివరకు భారత్ సహా 25 దేశాలు పోస్టల్ సర్వీసులను నిలిపివేసినట్టు ఐరాసలోని యూనివర్సల్ పోస్టల్ యూనియన్ వెల్లడించింది. ఐరాస సభ్య దేశాలకు సంబంధించి పోస్టల్ సేవల మధ్య సహకారం కోసం ఏర్పాటైన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేస్తుంది. పోస్టల్ ప్యాకేజీలపై అమెరికా పన్ను మినహాయింపు ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఇప్పటివరకు 25 దేశాలు అమెరికాకు పోస్టల్ సర్వీసులు నిలిపివేసినట్లు ఐరాస విభాగం తెలిపింది. ఇందుకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేస్తూ విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో ఆగస్టు 25న లేఖ రాసినట్టు వెల్లడించింది. అయితే, ఏయే దేశాలు ఈ జాబితాలో ఉన్నాయనే విషయాన్ని పేర్కొనలేదు. భారత్ సహా ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, నార్వే, స్విట్జర్లాండ్ తదితర దేశాలు ఈ ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

## పరిమిత కాలానికే విద్యార్థి వీసా

అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకొనే విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు మొదలైంది. విద్యార్థి వీసాలకు పరిమిత కాల గడువు విధించేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఎఫ్-1, జే-1 వీసాదారులు తమ కోర్సు మొత్తం పూర్తయ్యే వరకూ అమెరికాలో నివసించే అవకాశం ఉంది. అయితే ఈ వీసా గడువును పరిమితం చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రతిపాదించింది. దీని ప్రకారం ఇకపై కొద్దికాలం మాత్రమే చెల్లుబాటయ్యే వీసాలు జారీ చేస్తారు. కాల పరిమితి ఎంతో కచ్చితంగా తెలియనప్పటికీ విద్యార్థులు తమ డిగ్రీ పూర్తయ్యే లోపే వీసాను పొడిగించుకోవాల్సి వస్తుందని తెలుస్తోంది. వైట్‌హౌస్ ఆమోదం పొందిన ఈ ప్రతిపాదనను ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం త్వరలోనే ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించనున్నారు. అమెరికాలోని వర్సిటీల్లో 4.2లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో చాలామంది మాస్టర్స్, పీహెచ్‌డీ, దీర్ఘకాలిక రిసెర్చ్ ప్రోగామ్స్ చేస్తున్నారు. కోర్సు మధ్యలో ఉండగానే వీసా పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి రావడం ఆర్థికంగా భారం కావడంతో పాటు వారిపై అదనపు ఒత్తిడిని కూడా పెంచనుంది. ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం చోటుచేసుకున్నా వారు చట్టబద్ధమైన హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది.

## గాజా ప్రమాదకరమైన యుద్ధ ప్రాంతం

గాజా నగరాన్ని 'ప్రమాదకరమైన యుద్ధ ప్రాంతం'గా ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. మానవతా సాయాన్ని తీసుకెళ్ళే ట్రక్కులను అనుమతించేందుకు గానూ మధ్యాహ్నం పూట కాల్పులకు విరామం ఇవ్వడాన్ని ఇకపై నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఆహారం, ఇతర సహాయం అనుమతించేందుకై ఉదయం 10గంటల నుండి రాత్రి గంటల వరకు గాజా, డేర్ అల్ బాలా, మౌవసి తదితర ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దాడులను నిలిపివేసేది. ఈ ప్రాంతాల్లో వేలాదిమంది నిర్వాసితులు తల దాచుకున్నారు. అయితే గాజాలో తన దాడులను మరింత విస్తరించేందుకు ఇజ్రాయిల్ సన్నద్ధమవుతోంది. కీలకమైన ప్రాంతాల్లో ఇప్పటికే దాడులు మొదలయ్యాయి. వేలాదిమంది రిజర్విస్టులను కూడా రంగంలోకి దించింది. అయితే తాజాగా దాడులను మరింత ఉధృతం చేసినట్లైతే గాజాలో పరిస్థితులు అదుపు తప్పుతాయని ఐక్యరాజ్య సమితి ఇప్పటికే హెచ్చరించింది. ఇజ్రాయిల్ ఆర్మీ వైఖరితో ఇప్పటికే ఆహార డెలివరీలకు సవాళ్ళు ఎదురయ్యాయని నార్వే శరణార్థ మండలి ప్రకటించింది. గాజాలో ఆహార సరఫరాలను సమన్వయంచేసే సహాయక గ్రూపుల సంకీర్ణ సంస్థ ఇది. గతంలో ఎన్నడూ లేని రీతిలో విపరీతమైన ఆంక్షలను, కట్టుబాట్లను ఎదుర్కొంటున్నామని ఆ సంస్థ ప్రతినిధి షాయినా లౌ చెప్పారు. ఉధృతమైన మిలటరీ కార్యకలాపాల వల్ల తమ సేవా కార్యక్రమాలు మరింత దెబ్బ తింటున్నాయని చెప్పారు. విస్తరించిన సైనిక చర్యలో భాగంగా ఆర్మీ దాడులు కూడా మొదలుపెట్టినట్లు మిలటరీ ప్రతినిధి ఆదారీ ఎక్స్ పోస్టులో తెలిపారు. "ఇక వేచి వుండేది లేదు. ప్రాథమిక కార్యకలాపాలు ఆరంభమయ్యాయి" అని ప్రకటించారు. నగర శివార్లలో ప్రస్తుతం దాడులు ఉధృతంగా కొనసాగుతున్నాయన్నారు.

# జ్ఞానం పంచేవాడు ఉపాధ్యాయుడు

ముహమ్మద్ వహీదుద్దీన్

**మనిషి** జీవితాన్ని జ్ఞానం వెలుగులోకి తీసుకువచ్చేవాడు ఉపాధ్యాయుడు. కేవలం పాఠశాల విషయాలను మాత్రమే కాకుండా నిజాయితీ, శీలం, ధార్మికత, దయ, జాలి, క్రమశిక్షణ, శాంతి, న్యాయం, మాట్లాడే పద్ధతి వంటి ఉన్నతమైన విలువలను ఉపాధ్యాయుడు బోధిస్తాడు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగడానికి గట్టిగా పునాది వేస్తాడు. ఒక ఉపాధ్యాయుడు ఇచ్చిన పాఠం, సలహా, మార్గదర్శనం జీవితాంతం గుర్తుండిపోతుంది.

ఇస్లాంలో ఉపాధ్యాయుని స్థానం చాలా ఉన్నతమైనది. ఎందుకంటే అంతిమ దివ్య ఖుర్‌ఆన్ మొదటి ఆజ్ఞ 'చదువు' తోనే ఆరంభమవుతుంది. (దివ్య ఖుర్‌ఆన్ 96:1)

## దివ్య ఖుర్‌ఆన్‌లో ఉపాధ్యాయుని స్థానం

జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. (58: 11)

మనిషి ఎరుగని జ్ఞానాన్ని సృష్టికర్త అతనికి ప్రసాదించాడు. (96: 5)

ఆయన (సృష్టికర్త) కలం ద్వారా జ్ఞానం నేర్పాడు (96:4)

## దైవప్రవక్త(స) పాత్ర- ఉపాధ్యాయుడు

మేము మీలో నుండే ఒకరిని ప్రవక్తగా మీ మధ్యకు పంపాము. అతను మీకు మా వాక్యాలను వినిపిస్తాడు. మీ జీవితాలను తీర్చిదిద్దుతాడు. మీకు గ్రంథాన్నీ, దివ్య జ్ఞానాన్ని బోధిస్తాడు. మీకు తెలియని ఎన్నో విషయాలు నేర్పుతాడు.

(దివ్య ఖుర్‌ఆన్ 2: 151)

"ఆయనే నిరక్షరాస్యులలో (ఉమ్మీలలో) ఒక ప్రవక్తను స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు. వారి అంతరంగాలను పరిశుద్ధపరుస్తున్నాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ బోధిస్తున్నాడు." (62: 2)

## దివ్య జ్ఞానం- ఉపాధ్యాయుడు

అల్లాహ్ తాను కోరిన వారికి వివేకాన్ని ప్రసాదిస్తాడు. ఎవరికి వివేకం (హిక్మత్) లభించిందో, వాస్తవానికి వారికి అపారమైన మేళ్లు లభించినట్లే" (దివ్య ఖుర్‌ఆన్ 2: 269)

## హదీసులో ఉపాధ్యాయుని ప్రాధాన్యత

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : "మీలో ఉత్తములు వారు. ఖుర్‌ఆన్ నేర్చుకున్నవారు, ఇతరులకు నేర్పినవారు" (బుఖారీ)

ఇది ఉపాధ్యాయుని అత్యున్నత స్థానాన్ని తెలియజేస్తుంది. ఎందుకంటే ఉపాధ్యాయుడు ఇతరుల హృదయాల్లో ఇస్లాం కాంతిని నింపుతాడు.

ఒక మంచి మాట చెప్పడం కూడా ఒక దానమే (సదఖా). (ముస్లిమ్)


అంటే ఉపాధ్యాయుడు చెప్పే ప్రతి మంచి బోధన ఒక పుణ్య కార్యం అవుతుంది.

## సహాబీ సంఘటన

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్(రఅ) ఒక గొప్ప సహాబీ. చిన్న వయసులోనే ఆయన దైవప్రవక్త ముహమ్మద్(స) దగ్గర ఉండి ఉన్నతమైన జ్ఞానం ఆర్జించారు. తరువాత కాలంలో ఆయనను "ముఫస్సిరె ఖుర్‌ఆన్" (ఖుర్‌ఆన్ వ్యాఖ్యాత) అని పిలిచేవారు. ఎందుకంటే ఆయన అనేక మందికి దివ్య ఖుర్‌ఆన్ అర్థం చెప్పి ఉపాధ్యాయుని పాత్రను సమర్థవంతంగా నెరవేర్చారు. ఆయన బోధన వల్ల లక్షలాది మంది ఇస్లామ్ లోతైన విషయాలను అర్థం చేసుకున్నారు.

దీని ద్వారా మనకు తెలిసింది ఏమిటంటే, ఒక ఉపాధ్యాయుని ప్రభావం తరతరాల వరకు కొనసాగుతుంది.

ఉపాధ్యాయుడు నిజంగా సమాజానికి వెలుగు దారినిచ్చే దీపం.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**